తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక



హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 266 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | శనివారం, ఆగస్టు 15, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ..

క్యాబినెట్ కీలక నిర్ణయాలివీ..



హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ రఘురామిరెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్ధిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు.

ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించన్నట్లు చెప్పారు. ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాల్లను ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు.

మరికొన్ని కీలక నిర్ణయాలివీ..

- వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, వాటి సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని మంత్రివర్గం తీర్మానించింది.
- రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూ వీలైనంత త్వరగా స్థల సేకరణ చేసి నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది.



- కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్యూర్ పరిధిలో నగరంలో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలున్నాయి. వీటిని ఈవీ (విద్యుత్తు వాహనాలు)గా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50లక్షల సబ్సిడీ అందించాలని క్యాబినెట్ నిర్ణయించింది.
- హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును మరో 3 నెలలు పొడిగించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.
- మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-2 పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి అందనుంది. గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది

గ్యాస్‌కు ఈకేవైసీ గండం

- **చివరి తేదీ ఆగస్టు 16**
- **ముందే పంపిణీ నిలిపేస్తున్న డిస్ట్రిబ్యూటర్లు**
- **ఇలాంటి సిలిండర్లు నిత్యం 30 వేలపైనే?**



హైదరాబాద్: గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లకు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలని, లేనిపక్షంలో సరఫరా నిలిపివేస్తామని చమురు సంస్థలు ఆదేశాలు జారీచేశాయి. గడువు తేదీ ఈ నెల 16. వాస్తవానికి గ్యాస్ కనెక్షన్లకు ఈ-కేవైసీ చేయించుకోవాలని ఆయిల్ కంపెనీలు కొన్నేళ్లుగా కోరుతున్నాయి. తాజాగా డిస్ట్రిబ్యూటర్లు ఓ అడుగు ముందుకేసి గడువుకు వారం రోజుల ముందు నుంచే ఈ ఆదేశాల్ని అనధికారికంగా అమల్లోకి తెచ్చారు. దీంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిలిండర్ బుకింగ్ ప్రక్రియ పూర్తయితీరా డెలివరీ చేయాల్సిన సమయంలో డిస్ట్రిబ్యూటర్లు ఆపేస్తున్నట్లు తెలిసింది.

బుకింగ్‌లు 2 లక్షలు... సరఫరా 1.7 లక్షలు

రాష్ట్రవ్యాప్తంగా 1.3 కోట్లకు పైగా డొమెస్టిక్ (గృహ వినియోగరి) కనెక్షన్లు ఉన్నాయి. సిలిండర్ రీఫిల్లింగ్‌కు సగటున నిత్యం 2 లక్షల బుకింగ్‌లు అవుతుంటాయి. అంతే సంఖ్యలో సిలిండర్లను వినియోగదారులకు సరఫరా చేయాలి. కానీ, రోజూ సరఫరా చేస్తున్నవి 1.7 లక్షలేనని సమాచారం. ఆగిపోతున్న 30 వేల సిలిండర్లలో దాదాపుగా అన్నీ ఈ-కేవైసీ చేయనివేనని డిస్ట్రిబ్యూటర్లు అంగీకరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ-కేవైసీ పూర్తి కానివి ఇంకా సుమారు 26 లక్షలు ఉన్నట్లు సమాచారం. అంటే మొత్తం కనెక్షన్లలో 20% పైమాటే. బోగస్ పేర్లతో ఉన్న కనెక్షన్లు, ఒకే వ్యక్తి పేరుతో వేర్వేరు డిస్ట్రిబూటర్ల దగ్గర ఉన్న రెండు కనెక్షన్లను గుర్తించి తొలగించాలని ఆయిల్ కంపెనీలు ఈకేవైసీపై దృష్టి సారించాయి. ఒక కుటుంబ సభ్యుల్లో రెండు కనెక్షన్లపైనా ఆరా తీస్తున్నట్లు సమాచారం.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు... సాంకేతిక సమస్యలు

నిబంధనల ప్రకారం గ్యాస్ డెలివరీ సిబ్బంది వినియోగదారుల ఇంటి వద్దకే వెళ్లి ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తిచేసే అవకాశం ఉంది. కానీ అతి స్వల్పసంఖ్యలోనే డెలివరీ సిబ్బంది ఈ సేవలు అందిస్తుండగా మిగతావారంతా వట్టించుకోవట్లేదు. దీంతో వినియోగదారులు డిస్ట్రిబ్యూటర్ కార్యాలయాలకు వెళ్లి క్యూలో నిల్చోవాల్సి వస్తోంది. కొన్ని గ్రామాల్లో 30, 40 కి.మీ. దూరంలో గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు వ్యయప్రయాసలు ఎదురవుతున్నాయి. యాప్‌తో చేసుకోవచ్చని ఆయిల్ కంపెనీలు చెబుతున్నప్పటికీ.. ఓటీపీలు ఆలస్యంగా రావడం, బయోమెట్రిక్ ధ్రువీకరణ ఆలస్యం, సర్వర్ సకాలంలో స్పందించకపోవడం, ప్రక్రియను పూర్తిచేసినా 'ఫెయిల్డ్'అని రావడం వంటి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. చాలా ఓపికగా, పదేపదే ప్రయత్నించినవారికే పూర్తవుతోంది.

చర్చల్లేకుండానే 10 బిల్లుల ఆమోదం

కార్యకలాపాలేవీ లేకుండానే ముగిసిన వర్షాకాల సమావేశాలు

పార్లమెంటు భేటీ సమయం.. లోక్‌సభ 19%; రాజ్యసభ 39%



దిల్లీ: దేశవ్యాప్తంగా వానలు పెద్దగా లేకున్నా... పార్లమెంటు వర్షాకాలం సమావేశాలు మాత్రం అధికార, విపక్షపార్టీల ఆందోళనల మధ్య తుడిచిపెట్టుకుపోయాయి. ఒక్కటంటే ఒక్క అంశంపైనా సజావుగా చర్చించకుండానే... 19 రోజుల సమావేశాలు గురువారంతో ముగిశాయి. అధికార, విపక్షాల మధ్య పంతంతో గత కొన్ని సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత తక్కువ సమయం ఈసారి సభలు జరిగాయి. లోక్‌సభ షెడ్యూల్ సమయంలో 19శాతం, రాజ్యసభ 39శాతం మాత్రమే సమావేశమయ్యాయి. చర్చల్లేకుండానే 10 బిల్లులకు ఆమోదం లభించింది. రెండు బిల్లులపైనే చర్చ జరిగింది. ఒక బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి అప్పగించారు.

ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం చివరిరోజు సభకు హాజరయ్యారు. విద్యార్థులపై పోలీసు చర్య, అయోధ్య రామ మందిర విరాళాల చోరీ అంశంపై లోక్‌సభలో గురువారమూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. సభ ప్రారంభం కాగానే వందేమాతరంలోని 6 చరణాలను వినిపించారు. ఆ తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేస్తూ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకున్నారు. సభ పనితీరు, పనిగంటలపై ముగింపు సందర్భంగా లాంఛనంగా చేసే ప్రకటన కూడా స్పీకర్ చేయలేదు.

రాజ్యసభలోనూ చివరి రోజైన గురువారం ఎటువంటి కార్యకలాపాలు జరగలేదు. ప్రతిపక్షాలు పలుమార్లు అంతరాయం కలిగించడంతో గనుల బిల్లుకు ఆమోదం లభించిన అనంతరం సభను చైర్‌పర్సన్ సీపీ రాధాకృష్ణన్ నిరవధికంగా వాయిదా వేశారు. అధికార ఎన్డీయే, ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు గురువారమూ పార్లమెంటు ఆవరణలో నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. రెండు వర్గాల మధ్య ఘర్షణ జరగకుండా భద్రతా సిబ్బంది అడ్డుగా నిల్చున్నారు.

లోక్‌సభ ఇలా...

ఈసారి లోక్‌సభ 19 శాతం సమయమే సమావేశమైంది.

ప్రతిపక్షాల ఆందోళనల కారణంగా ఒక్క రోజూ ప్రశ్నోత్తరాల సమయం జరగలేదు. లోక్‌సభ 12 బిల్లులకు ఆమోదం తెలిపింది. ఇందులో రెండింటిపైనే చర్చ జరిగింది.

గతంలో 2010 శీతాకాల సమావేశాల్లో 5శాతం ప్రొడక్టివిటీ, 2013 శీతాకాల సమావేశాల్లో 8శాతం ప్రొడక్టివిటీ సాధించింది. ఇవి రెండే ప్రస్తుత సమావేశాలకన్నా తక్కువ



మోదీ, షాలను నిద్రపోనివ్వం

భాజపా-ఆరెస్సెస్ నేతలకు దేశంపై అవగాహన లేదు: రాహుల్

రచనాత్మక్ కాంగ్రెస్ సమావేశంలో ప్రసంగిస్తున్న రాహుల్

దిల్లీ: ఆలింగనాలే ప్రధాని నరేంద్రమోదీ విదేశీ దౌత్యం అని, ఇతర దేశాలతో సంబంధాలంటే అంతేనని ఆయన బలంగా నమ్ముతున్నారని లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. భాజపా-ఆరెస్సెస్ అంటే విదూషకుల బృందమని, అందులో ఉన్నవారికి దేశంపట్ల అవగాహన లేదన్నారు. గురువారం దిల్లీలో 'రచనాత్మక్ కాంగ్రెస్ జాతీయ సమ్మేళనం'లో రాహుల్ ప్రసంగించారు. రచనాత్మక్ కాంగ్రెస్ అధిపతి సందీప్ దీక్షిత్‌ను వేదికపై హత్తుకుని, ప్రస్తుత సర్కారుకు ఉన్న విదేశాంగ విధానం ఇదేనని ఎద్దేవా చేశారు. "అసలైన శక్తిగా ఆరెస్సెస్ చనిపోయింది. ఇప్పుడు అది అదానీ, అంబానీ వంటి బడా పారిశ్రామికవేత్తల చేతిలో సాధనంగా మారింది. తమతో పాటు కొద్దిమందికి మేలు చేసే ఆదేశాలు ఇవ్వడమే భాజపా-ఆరెస్సెస్‌ల రాజకీయ సిద్ధాంతం. కొన్ని పరిమితుల దృష్ట్యా మీడియా కూడా అనేక అంశాల్లో ప్రభుత్వానికి వంత పాడుతోంది. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామాలు చేసే రోజు వరకు ప్రభుత్వంపై కాంగ్రెస్ ఒత్తిడి పెంచుతూనే ఉంటుంది. వారిని నిద్రపోనివ్వం. ఇప్పటికే మోదీకి నిద్రపట్టడం లేదు. చాణక్యుడిగా చెప్పే అమిత్ షా పార్లమెంటుకు రాకుండా పారిపోయారు. నిరసనల సెగ మొదటిసారిగా వారికి తగిలింది" అని రాహుల్ చెప్పారు. అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో మన బలగాలను చైనా అడ్డుకుందని, దానిని దాచిపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధానమంత్రి కార్యాలయం లోపలి నుంచి తనకు సమాచారం అందుతోందని తెలిపారు. సరిహద్దు విషయంలో ప్రధాని, హోం మంత్రి, రక్షణమంత్రి ఏమీ చేయడం లేదని విమర్శించారు.

తెలంగాణ పవర్

సంపాదకీయం

శనివారం, ఆగస్టు 15, 2026

తెలుగు రాష్ట్రాల్లో కనిపించని జెన్ జీ

ఆధునిక రాజకీయాల్లో జెన్ జీ ఓటర్లు అత్యంత కీలకమైన శక్తిగా మారుతున్నారు. జెన్ జీ వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాలను గడగడలాడించిన దృశ్యాలను చూసి, తెలుగు రాష్ట్రాల రాజకీయ పార్టీలు కూడా ఈ తరాన్ని తమవైపు తిప్పుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే, గడిచిన కొద్దికాలంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే.. పార్టీలు ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న జెన్ జీ కార్డు క్షేత్రస్థాయిలో ఆశించిన ప్రభావం చూపలేకపోతోంది తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా జెన్ జీ ఆధారిత ప్రచారాన్ని తీవ్రంగా నడిపే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ చదువుల్ని క్రిమినల్ వేస్ట్ అని సంబోధించడంతో యువ ఇంజనీర్లందర్నీ అలా అన్నారని కేటీఆర్ క్యాంపెయిన్ చేశారు. క్రిమినల్ వేస్ట్ , అన్ ఫిట్ వంటి హ్యాష్‌ట్యాగ్‌లు, మీమ్ కల్చర్‌తో యంగ్ ఓటర్లను ఆకట్టుకోవాలని చూశారు. అయితే, ఈ మీమ్స్ సోషల్ మీడియాలో ఎంటర్‌టైన్‌మెంట్‌గా మాత్రమే మిగిలిపోయాయి తప్ప, నిరుద్యోగ యువతను లేదా కాలేజీ విద్యార్థులను రోడ్లపైకి తెచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాస్ ప్రొటెస్ట్‌గా మార్చడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైంది.ఇక ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మరోలా ఉంది. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన తర్వాత పార్టీని పునర్నిర్మించే క్రమంలో యువతను ఆకట్టుకునేందుకు వినూత్నంగా ప్రయత్నించింది. అయితే, నిజమైన తటస్థ జెన్ జీ యువతను భాగస్వాములను చేయడం కంటే, ఇప్పటికే పార్టీలో ఉన్న తమ అనుబంధ విద్యార్థి విభాగం, ఐటీ సెల్ కార్యకర్తలకే జెన్ జీ అనే కొత్త ల్యాబెల్ వేసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించడం కనిపించింది. డీఎస్సీ పోరాటాల్లో ఈ పద్ధతి ఎక్కువగాఉంది. కేవలం పార్టీ ప్రచార పత్రాలు పట్టుకుని ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లలో హల్‌చల్ చేయడం వల్ల అది కేవలం ఆర్గనైజ్డ్ పార్టీ ప్రచారంగానే మిగిలిపోయింది తప్ప, ఏపీలోని సాధారణ యువతలో ఎలాంటి పొలిటికల్ అవ్‌రైజింగ్‌ను తీసుకరాలేకపోయింది.తెలుగు యువతలో అత్యధిక శాతం మంది ఐటీ ఉద్యోగాలు, యూఎస్/యూకే ఉన్నత చదువులు, గ్రూప్స్. సివిల్స్ , ఇతర ప్రభుత్వ ఉద్యోగాల సాధనలోనే నిమగ్నమై ఉన్నారు. డిజిటల్ స్పేస్‌లో తమ అభిప్రాయాలను వ్యక్తపరిచినా, రోడ్లెక్కి నిరసన తెలిపితే నమోదయ్యే క్రిమినల్ కేసులు తమ భవిష్యత్తు, వీసా అవకాశాలను దెబ్బతీస్తాయనే హెచ్చరిక వారిని వెనక్కి లాగుతోంది. నేటి తరం రాజకీయ వ్యతిరేకతను లేదా మద్దతును రీల్స్, మీమ్స్, ఎక్స్ , స్పేసెస్, డోపమైన్ ఇచ్చే డిజిటల్ కంటెంట్ రూపంలోనే చూపిస్తోంది. వీధి పోరాటాల కంటే డిజిటల్ ట్రోలింగ్‌నే వారు సౌకర్యవంతమైన యాక్టివిజంగా భావిస్తున్నారు.రాజకీయ పార్టీలు జెన్ జీ మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడంలో పొరబడుతున్నాయి. నాయకులు వేసే మీమ్స్ లేదా వాడే జార్గన్స్ చూసి తమను వారు ప్రతిబింబిస్తున్నారని యువత భావించడం లేదు. పార్టీలు ప్రదర్శించే ప్రచా కృత్రిమమైనది గా ఉండటంతో యువత సులభంగా గుర్తిస్తోంది. ఉపాధి అవకాశాలు, క్వాలిటీ ఎడ్యుకేషన్, గిగ్ ఎకానమీ కార్మికుల సమస్యలు, స్టార్టప్ ఈకోసిస్టమ్, ప్రాజెక్టుల పురోగతి వంటి నిజమైన ఎజెండా వదిలేసి.. కేవలం వ్యక్తిగత దూషణలు, రాజకీయ ట్రోలింగ్ చుట్టూ తిరిగే కంటెంట్‌ను జెన్ జీ లైట్ తీసుకుంటోంది.రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయనంత మాత్రాన తెలుగు జెన్ జీకి రాజకీయ స్పృహ లేదనుకోవడం పార్టీల పెద్ద పొరపాటే అవుతుంది. వారు నిశ్శబ్దంగా గమనించే సైలెంట్ ఓటర్లు . బూత్ లెవల్‌కి వచ్చి ఓటు వేసే సమయంలో సాంప్రదాయ కుల, ప్రాంతీయ సమీకరణల కంటే.. వ్యక్తిగత స్వాతంత్ర్యం, ఉద్యోగ కల్పన, పారదర్శక పాలన అందించే నాయకులకే ప్రాధాన్యత ఇస్తారు. ఏదైనా ఒక రాజకీయ పార్టీ తమ సొంత ప్రయోజనాల కోసం తమను పొలిటికల్ టూల్ గా వాడుకోవాలని చూస్తే తిరస్కరించడంలో ఈ తరం ముందే ఉంటుంది. నాయకులు కేవలం మీమ్స్‌కే పరిమితం కాకుండా, వారి భవిష్యత్తుకు భరోసానిచ్చే విజన్‌ను చూపినప్పుడే ఈ తరం ఓటర్లు నిజమైన మద్దతుదారులవుతారు.

- ఎడిటర్

మహీంద్రా యూనివర్సిటీ సెమీకండక్టర్ ప్రతిభను అభివృద్ధి చేసేందుకు భారతదేశంలో రెండో హ్యాకర్ ఫ్యాబ్ ను ఏర్పాటు చేయనుంది

ఐ ఐ టి బాంబేలో విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటైన హ్యాకర్ ఫ్యాబ్ తర్వాత, మహీంద్రా యూనివర్సిటీ భారతదేశంలో రెండో హ్యాకర్ ఫ్యాబ్ ను, అలాగే పూర్తిగా యూనివర్సిటీ ఆధ్వర్యంలో, విద్యార్థుల నేతృత్వంలో నడిచే తొలి ఓపెన్-సోర్స్ సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ సదుపాయాన్ని ఏర్పాటు చేయనుంది.
విద్యార్థులకు కీలకమైన ఫ్యాబ్రికేషన్ పరికరాల తయారీతో సహా సెమీకండక్టర్ తయారీపై ప్రత్యక్ష అనుభవాన్ని అందిస్తుంది.

హైదరాబాద్ ఆగస్టు 14, 2026: మహీంద్రా యూనివర్సిటీ ఈరోజు భారతదేశంలో రెండో హ్యాకర్ ఫ్యాబ్ ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇది ఐ ఐ టి బాంబేలో విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటైన హ్యాకర్ ఫ్యాబ్ తర్వాత దేశంలో రెండోది కాగా, పూర్తిగా యూనివర్సిటీ ఆధ్వర్యంలో, విద్యార్థుల నేతృత్వంలో నడిచే తొలి ఓపెన్-సోర్స్ సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ సదుపాయం కానుంది. ఈ కార్యక్రమం భారతదేశ సెమీకండక్టర్ లక్ష్యాలకు, అలాగే ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు యూనివర్సిటీ అందిస్తున్న సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

తక్కువ ఖర్చుతో కూడిన ఫ్యాబ్రికేషన్ పరికరాలను విద్యార్థులే రూపొందించి అభివృద్ధి చేసేలా ప్రోత్సహించడం ద్వారా, సెమీకండక్టర్ తయారీ రంగంలో దేశీయ నైపుణ్యాలు మరియు సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. ఓపెన్-సోర్స్ హ్యాకర్ ఫ్యాబ్ నమూనా ఆధారంగా రూపొందుతున్న ఈ సదుపాయం విద్యార్థులకు సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్‌పై ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడంతో పాటు, ఈ వ్యూహాత్మకంగా కీలకమైన రంగంలో భారతదేశ ప్రతిభా వనరులను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది.

యూనివర్సిటీకి చెందిన బి టెక్ . ఐ యెన్ వి ఎల్ ఎస్ ఐ డిసైన్ టెక్నాలజీ ప్రోగ్రామ్ విద్యార్థుల నేతృత్వంలో హ్యాకర్ ఫ్యాబ్ పనిచేయనుంది. ఇందులో మాస్క్‌లెస్ ఫోటోలిథోగ్రఫీ సిస్టమ్, ఆర్ ఎఫ్ స్పట్టరింగ్ ఛాంబర్, స్పిన్ కోటర్, ట్యూబ్ ఫర్నేస్ వంటి కీలక సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ పరికరాల తయారీపై ప్రధానంగా దృష్టి సారిస్తారు. ఈ ప్రాక్టికల్ విధానం, బోధన పరిశోధన కోసం



క్లీన్‌రూమ్ సదుపాయాన్ని ఏర్పాటు చేయాలన్న మహీంద్రా యూనివర్సిటీ ప్రణాళికలకు అనుసంధానంగా ఉంటుంది. దీని ద్వారా విద్యార్థులకు చిప్ డిజైన్‌తో పాటు ఫ్యాబ్రికేషన్‌పై కూడా ప్రత్యక్ష అవగాహన లభిస్తుంది.

మహీంద్రా గ్రూప్ చైర్మన్, మహీంద్రా యూనివర్సిటీ ఛాన్సలర్ ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ, "ప్రతి గొప్ప భారతీయ ఆవిష్కరణ వెనుక, అది ఎలా పనిచేస్తుందో తెలుసుకోవడానికి దాన్ని విప్పి చూసిన ఒక వ్యక్తి ఉంటాడు. హ్యాకర్ ఫ్యాబ్ విద్యార్థులకు అదే చేయడానికి పూర్తి స్వేచ్ఛను ఇస్తుంది. తప్పులు చేయడానికి, వాటిని సరిదిద్దడానికి, మళ్లీ ప్రయత్నించడానికి ఎలాంటి అనుమతి అవసరం లేకుండా. ఇలా నిర్మించడంలో భయపడని ఒక తరాన్ని తీర్చిదిద్దవచ్చు. మహీంద్రా యూనివర్సిటీ నిర్మించడంలో సహాయపడాలని నేను కోరుకునే భారతదేశం ఇదే." అని అన్నారు.

మహీంద్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. యజులు మెదురి మాట్లాడుతూ, "భారతదేశ సెమీకండక్టర్ లక్ష్యాలను సాధించడానికి డిజైన్‌తో పాటు ఫ్యాబ్రికేషన్‌పై కూడా ప్రాక్టికల్ అవగాహన ఉన్న ఇంజనీర్లు అవసరం. హ్యాకర్ ఫ్యాబ్ ద్వారా విద్యార్థులు ల్యాబ్‌లోనే పరికరాలను నిర్మించి, ఆలోచనలను పరీక్షించి, ఫ్యాబ్రికేషన్ ప్రక్రియను ప్రత్యక్షంగా అర్థం చేసుకుంటారు. మా వీ ఎల్ ఎస్ ఐ ప్రోగ్రామ్‌లు ప్రతిపాదిత క్లీన్‌రూమ్‌తో కలిసి, భారతదేశానికి పరిశ్రమ అవసరాలకు సిద్ధంగా ఉన్న సెమీకండక్టర్ ప్రతిభను అభివృద్ధి చేయడంపై మా దృష్టిని ఇది మరింత బలోపేతం చేస్తుంది." అని తెలిపారు.

హ్యాకర్ ఫ్యాబ్ కేర్ ఫ్యాబ్ ను కార్నెజి మెలోన్ యూనివర్సిటీ లోని డిపార్ట్మెంట్ అఫ్ ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్ 2023లో ఓపెన్-సోర్స్ కార్యక్రమంగా ప్రారంభించింది. తక్కువ ఖర్చుతో విద్యార్థులే నిర్మించే పరికరాల ద్వారా సెమీకండక్టర్ మైక్రోఫ్యాబ్రికేషన్‌ను మరింత అందుబాటులోకి తీసుకురావడం దీని ప్రధాన లక్ష్యం. అనంతరం ఈ నమూనాను అంతర్జాతీయంగా, అలాగే భారతదేశంలోని పలు విద్యాసంస్థలు స్వీకరించాయి.

ఐ ఐ టి బాంబే విద్యార్థులు ఆగస్టు 2025లో భారతదేశపు తొలి విద్యార్థుల నిర్మిత హ్యాకర్ ఫ్యాబ్‌ను ప్రారంభించారు. సెమీకండక్టర్ తయారీలో ఉపయోగించే మాస్క్‌లెస్ లిథోగ్రఫీ, స్పిన్ కోటింగ్, స్పట్టరింగ్ ఫర్నేస్ సిస్టమ్స్ వంటి పరికరాల ప్రోటోటైప్‌లను వారు క్యాంపస్‌లోనే అభివృద్ధి చేశారు. దీని ద్వారా అండర్‌గ్రాడ్యుయేట్ ఇంజనీర్లకు సెమీకండక్టర్ ఫ్యాబ్‌లలో ఉపయోగించే ప్రక్రియలు, వ్యవస్థలపై ప్రాక్టికల్ అనుభవం లభించింది.

సెమీకండక్టర్ విద్యలో మహీంద్రా యూనివర్సిటీ చేస్తున్న పెట్టుబడులను ఈ కార్యక్రమం మరింత విస్తరిస్తుంది. భారత ప్రభుత్వ సెమీకండక్టర్ ప్రాధాన్యతలకు అనుగుణంగా యూనివర్సిటీ 2023లో ఏం టెక్ వి ఎల్ ఎస్ ఐ ఎమ్ బే డెడ్ సిస్టం , అనంతరం 2024లో బి టెక్ వి ఎల్ ఎస్ ఐ డిసైన్ టెక్నాలజీ ప్రోగ్రామ్‌లను ప్రారంభించింది. విద్యార్థులకు సైనోప్సిస్, కాడెన్సు ఈ డి ఏ సూట్లు వంటి పరిశ్రమ ప్రమాణాల సాఫ్ట్‌వేర్ టూల్స్ ప్లాట్‌ఫారమ్‌లతో పాటు ఏ ఎమ్ డి సిలికాన్ లాబ్స్ నుంచి హార్డ్‌వేర్ సహకారం కూడా అందుబాటులో ఉంది.

హ్యాకర్ ఫ్యాబ్ ద్వారా మహీంద్రా యూనివర్సిటీ సెమీకండక్టర్ డిజైన్, ఫ్యాబ్రికేషన్ పరిశోధనలను మరింత దగ్గరగా అనుసంధానిస్తోంది. భారతదేశం తన దేశీయ సెమీకండక్టర్ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకుంటున్న నేపథ్యంలో, దేశ సాంకేతిక స్వావలంబనకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ప్రాక్టికల్ అనుభవం కలిగిన ఇంజనీర్లను తయారు చేయడంపై యూనివర్సిటీ తన దృష్టిని కొనసాగించనుంది.

అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ లో శ్రావణమాస శోభా - గౌరీమాతకు చైర్మన్ వి నరేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు

కరీంనగర్, ఆగస్ట్ 14: కరీంనగర్: స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని 'శ్రావణ శోభ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శ్రీగౌరీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రావణ మాసం అత్యంత పవిత్రమైనదని, ఈ మాసంలో వ్రతాలు, దానధర్మాలు చేయడం ద్వారా ఆధ్యాత్మిక



ఫలితాలు పొందవచ్చని తెలిపారు. శ్రావణ శుక్రవారం, నాగుల పంచమి, రాఖీ పౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి, శివారాధన, విష్ణు ఆరాధన, గౌరీదేవి పూజ వంటి పర్వదినాలు ఈ మాసంలోనే రావడం ప్రత్యేకత అన్నారు.

శ్రావణ మాస ప్రాముఖ్యతను చాటేలా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పూలు, వివిధ అలంకరణలతో పాఠశాల ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతం కుంకుమ పూజా కార్యక్రమం లో పాల్గొన్న మహిళలు



ఖమ్మం బ్యూరో తెలంగాణ పవర్ ఆగస్టు 14: ఖమ్మం మధుర నగర్ శ్రీనగర్ కాలనీ రోడ్ నెంబర్ 12 లో గల శ్రీ శ్రీ శ్రీ సమర్థ సద్గురు సాయి నాథ మందిరం లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు, కుంకుమ పూజ కార్యక్రమం .200 మహిళలు పాల్గొన్నారు, దేవాలయ కమిటీ వారు పూజలో పాల్గొన్న మహిళలకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమం ఆలయ కమిటీ ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు అంగరంగ వైభవంగా ఏర్పాటు చేయడం జరిగింది

చిరాగ్‌పల్లిలో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులు -ప్రారంభించిన రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి



జహీరాబాద్, ఆగస్టు 14: జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లీ గ్రామంలో రూ. 25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డి శుక్రవారం కొబ్బరికాయ కొట్టి రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామంలో రహదారి సౌకర్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో ఈ పనులను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మిని ప్రకాష్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, అనేగుంట సర్పంచ్ నరేష్, సీనియర్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, సునీల్, గ్రామ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సెలబ్రెటీలకు ఫుడ్ సేఫ్టీ వార్నింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 14, (న్యూస్ పల్స్) కొన్ని సంస్థలు, కంపెనీలు ప్రచారం చేసుకునేందుకు సోషల్ మీడియాను ఎందచుకుంటున్నాయి. ఇందులోని ఇన్ ఫ్లుయెన్సర్స్ సైతం ఆదాయం పెంచుకునేందుకు కొన్ని ప్రత్యేక ప్రొడక్ట్స్ ను విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. చాలా మంది ఇలా వాటి గురించి తెలుసుకొని వస్తువులు, ఆహార పదార్థాలు కొనుగోలు చేస్తున్నారు. ఇలా ప్రచారం చేసేవారిని 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఉత్పత్తుల గురించి పూర్తిగా తెలుసుకోకుండా ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. దీని గురించి పూర్తి వివరాల్లోకి వెళితే..కొందరు సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఆహార పదార్థాలు, వాటి ఆరోగ్య ప్రయోజనాల గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అయితే ఉత్పత్తుల గురించి ధ్రువీకరించని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేయొద్దని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆహారపదార్థాల్లోని 'ఇమ్యూనిటీ' 'పోషకాలు అధికంగా ఉన్నాయి' వంటి వాటి గురించి నిజానిజాలను పరిశీలించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరించింది.ఒక ఉత్పత్తిని ప్రమోట్ చేస్తున్నప్పుడు దాని ప్యాకేజింగ్‌పై ఉన్న వివరాలు, పోషక విలువలు, తయారీదారు చేస్తున్న ఆరోగ్య క్లెయిమ్స్ వంటి అంశాలను ఇన్‌ఫ్లుయెన్సర్లు పరిశీలించాలి. కేవలం బ్రాండ్ చెప్పిందని లేదా డబ్బులు తీసుకుని నిర్ధారణ లేని ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు చెప్పకూడదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం ఫుడ్‌కు సంబంధించిన క్లెయిమ్స్ నిజమైనవి, స్పష్టమైనవి, అర్థవంతమైనవి, వినియోగదారులను తప్పుదోవ పట్టించనివిగా ఉండాలి.ఒక ఆహార పదార్థం లేదా దానిలోని ఏదైనా పదార్థం ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని చెప్పే హెల్త్ క్లెయిమ్స్‌కు తగిన శాస్త్రీయ ఆధారాలు ఉండాలి. గతంలో కూడా ఫుడ్ ప్రొడక్టులపై తప్పుదు లేదా అతిశయోక్తి ఆరోగ్య క్లెయిమ్స్ అనుమతించబోమని స్పష్టం చేసింది. ఒక ఉత్పత్తిలో ప్రొటీన్, విటమిన్లు లేదా మరేదైనా పోషక పదార్థం ఉన్నంత మాత్రాన దాన్ని మొత్తం ఆరోగ్యకరమైన ఆహారంగా చిత్రీకరించడం సరైనది కాదు. ఇదొక్కటే 'ఆరోగ్యకరమైనది'గా చూపకుండా, సమతుల్య ఆహారం, పండ్లు, కూరగాయలు, శారీరక శ్రమ వంటి అంశాలతో కలిపి ఆహారాన్ని చూడాల్సి ఉంటుంది.

తెలంగాణ పవర్

శనివారం, ఆగస్టు 15, 2026

తెలంగాణకు జనసేన ముఖ్యమంత్రి!



హైదరాబాద్, ఆగస్టు 14 (న్యూస్ పల్స్) తెలంగాణ రాజకీయాల్లో జనసేన పాత్రపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా జనసేన ఎదిగే అవకాశాలు ఉన్నాయని, వచ్చే మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు సూచించారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన భవిష్యత్తుపై రాజాసింగ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 2014 నుంచి తెలంగాణ రాజకీయాల్లో శూన్యత నెలకొందని, జనసేన ఆ శూన్యతను భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని రాజాసింగ్ వ్యాఖ్యానించారు తెలంగాణలో బీజేపీ, జనసేన పొత్తు ఉండదంటూ బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు రామచంద్రరావు ఇటీవల ప్రకటన చేసిన నేపథ్యంలో తాజాగా రాజాసింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ఆదరణ ఉందని, జనసేన పార్టీకి మద్దతు పెరుగుతోందని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా అత్యంత కీలక పరిణామానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. రాజాసింగ్ ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారనేది స్పష్టంగా తెలియకపోయినా, తెలంగాణ రాజకీయాల్లో జనసేనను ఓ వర్గం కోరుకుంటుంది అనే సంకేతాలు అందుతున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు తెలంగాణలో జనసేన బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలని తాను కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి పెట్టేలా జనసేనాని ఇప్పటి నుంచే ప్రణాళికలు రచించాలని రాజాసింగ్ కోరారు. ఇదే సమయంలో ఆయన తెలంగాణ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్షంలోని బీఆర్ఎస్, బీజేపీపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధానంగా పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందని రాజాసింగ్ ఆరోపించారు. అదే సమయంలో బీజేపీలో పరిస్థితులు ఏమంత బాగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల పెద్దగా ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి పరిస్థితుల్లో జనసేన గట్టిగా పనిచేస్తే తెలంగాణలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని సంచలన విశ్లేషణ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చూసిన జనాలు విసిగిపోయారని, బీజేపీ అంతర్గత రాజకీయాలు వల్ల అధికారంలోకి వచ్చే అవకాశం లేదని రాజాసింగ్ విశ్లేషించారు. ప్రస్తుతం ఈ అంశంపైనే ఎక్కువ చర్చ జరుగుతోందని, తన అంచనాల ప్రకారం వచ్చే ఎన్నికల్లో జనసేన ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. గత ఎన్నికల్లో బీజేపీ టికెట్ పై పోటీ చేసిన రాజాసింగ్ గత ఏడాది ఆ పార్టీకి రాజీనామా చేశారు. హిందుత్వవాదిగా ముద్రపడిన ఆయన తాజాగా చేసిన వ్యాఖ్యలతో జనసేనాని పవన్ కు దగ్గరయ్యే సంకేతాలిస్తున్నారని పరిశీలకులు అనుమానిస్తున్నారు.

గ్రేటర్ పోరులో పార్టీలు...

హైదరాబాద్, ఆగస్టు 14 (న్యూస్ పల్స్) తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టాయి. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావాలని నిర్ణయించడం గమనార్హం. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఇదే వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. వాస్తవానికి.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు క్షేత్రస్థాయిలో బలంగానే ఉన్నాయన్న వాదన ఉంది. బీజేపీకి మాత్రమే హైదరాబాద్ సహా.. కొన్ని జిల్లాల్లో బలం ఉన్నా.. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడే ఉంది బీజేపీ సంస్థాగతంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా పార్టీ పెద్దలు.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణను దక్కించుకునేందుకు రెడీగా ఉన్నారు. కానీ, క్షేత్రస్థాయిలో వారి అంచనాలకు అనుగుణంగా కార్యకర్తలు బలోపేతం కావడం లేదు. పార్టీ నాయకుల మధ్య కూడా సఖ్యత కనిపించడం లేదు. ఈ పరిణామాలను సరిదిద్దుకునేందుకు బీజేపీ సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టింది. ఈ మేరకు పార్టీ చీఫ్ రామచందర్‌రావు.. చర్యలు చేపట్టారు.ఇక, సంస్థాగతంగా బాగానే ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లు కూడా.. ఈదిశగానే అడుగులు వేయడం ఏంట నేది చర్చకు దారితీస్తోంది. దీనికి ప్రధానంగా ఒకపార్టీపై మరో పార్టీ చేసుకుంటున్న విమర్శలు.. వేసుకుం టున్న నిందలే కారణమని అంటున్నారు పరిశీలకులు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయడం లేదని, కేసీఆర్ తీసుకువచ్చిన పథకాలను కూడా నీరు గారుస్తోందని, రైతులు ఉసూరుమంటున్నారని.. బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. దీని నుంచి తమను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇక, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం.. ముఖ్యంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధిపతి కేసీఆర్ కేంద్రంగా సాగుతున్న విమర్శలకు అడ్డుకట్ట వేయాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా ఉంది. ఇక, ఉమ్మడి సమస్యల విషయానికి వస్తే.. క్షేత్రస్థాయిలో చిన్నా చితకా పార్టీల ఆవిర్భావం.. వాటి వల్ల తమ ఓటు బ్యాంకు ప్రభావితమయ్యే పరిస్థితిని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు లెక్కలు వేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు.. క్షేత్రస్థాయి కార్యకర్తలను కాపాడుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాయి

తెలంగాణలోనూ మఖానా సాగు

హైదరాబాద్, ఆగస్టు 14 (న్యూస్ పల్స్) వ్యవసాయ రంగంలో పరస్పర సహకారం కోసం తెలంగాణ, బిహార్ రాష్ట్రాలు ముందుకు వచ్చాయి. తెలంగాణలో విజయవంతమైన ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని అధ్యయనం చేయడానికి బిహార్ ఆసక్తి చూపగా.. బిహార్‌లో ప్రసిద్ధి చెందిన మఖానా సాగు, ప్రాసెసింగ్ విధానాలపై తెలంగాణ ఆసక్తి వ్యక్తం చేసింది. సెక్రటేరియట్‌లో తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బిహార్ మంత్రి విజయ్‌కుమార్ సిన్హా భేటీ అయి.. ఉత్తమ వ్యవసాయ పద్ధతులు, పంటల వైవిధ్యీకరణపై చర్చించారు. ఈ రెండు రాష్ట్రాల వ్యవసాయ శాఖల మధ్య చోటుచేసుకున్న ఈ పరిణామం నూతన వ్యవసాయ సహకారానికి మార్గం సుగమం చేస్తోంది.ఈ మేరకు బిహార్ వ్యవసాయ శాఖ మంత్రి విజయ్‌కుమార్ సిన్హా హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు. ఈ భేటీలో వ్యవసాయంలో అత్యాధునిక సాంకేతికత వినియోగం, రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలు, కొత్త పంటల సాగు, ప్రాసెసింగ్ పరిశ్రమలు, మార్కెటింగ్ విధానాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, నర్సరీల అభివృద్ధి, పామాయిల్ ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాటుపై బిహార్ మంత్రి ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. రాష్ట్రంలో 2025?26లో సుమారు 3.1 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరిగి 74 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామాయిల్ ఉత్పత్తి అయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నమూనాను పరిశీలించేందుకు బిహార్ నుంచి ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని పంపనున్నారు.మరోవైపు బిహార్‌లో విస్తృతంగా సాగయ్యే మఖానా పంటపై తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ముడి ఉత్పత్తిగా కాకుండా ప్రాసెసింగ్, బ్రాండింగ్, విలువ జోడింపుతో మార్కెట్ చేయడంపై బిహార్ అనుభవాన్ని అధ్యయనం చేయాలని తెలంగాణ భావిస్తోంది. బిహార్‌లో పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాల కోసం ప్రత్యేక పంట క్లస్టర్లను అభివృద్ధి చేసిన విధానాన్ని ఆ రాష్ట్ర అధికారులు వివరించారు. ఈ పరస్పర సహకారం వల్ల రెండు రాష్ట్రాల రైతులకు కొత్త పంటలు, సాంకేతికతలు, ప్రాసెసింగ్ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణకు మఖానా వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు మార్గం సుగమం కాగా.. బిహార్‌కు ఆయిల్‌పామ్ వంటి వాణిజ్య పంటను విస్తరించే అవకాశం లభిస్తుంది. ఇరు రాష్ట్రాల శాస్త్రవేత్తలు, రైతుల బృందాల పర్యటనల ద్వారా ఉత్తమ పద్ధతుల మార్పిడి మరింత వేగవంతం కానుంది.

రెంటికి చెడ్డ రేవడిలా ఆ 10 మంది

హైదరాబాద్, ఆగస్టు 14 (న్యూస్ పల్స్) రాజకీయాల్లో గోడ దూకిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యి లా తయారైంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి తమ నియోజకవర్గాలను డెవలప్ చేసుకుందామనో, లేక రాజకీయ భవిష్యత్తును సురక్షితం చేసుకుందామనో భావించి కాంగ్రెస్ తీర్థం పుచ్చు కున్న ఈ పది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరంటే ఒక్కరు కూడా ప్రస్తుతం సంతోషంగా లేరనేది పొలిటికల్ వర్గాల్లో సాగుతున్న ప్రచారం. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వంటి కొందరు నేతలు తమ ఆవేదనను బహిరం గంగానే వెళ్లగక్కుతుండగా, మిగిలిన వారు లోలోపల రగిలిపోతూ ఉక్కపోతకు గురవుతున్నారు. ఈ ఎమ్మెల్యేల ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన మూలకారణం.. వీరిని కాంగ్రెస్ పార్టీ సాంకేతికంగా, అధికారికంగా తమలో విలీనం చేసుకోలేకపోవడమే. వీరు కాంగ్రెస్‌లో చేరలేదని స్పీకర్ తీర్పిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మా ఎమ్మెల్యేలు అయితే మా పార్టీ సమావేశాల్లో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నిస్తోంది. కోర్టులు, ఎన్నికల సంఘం లేదా సాంకేతిక విచారణల ముందుకు వచ్చినప్పుడు.. మేము కాంగ్రెస్‌లో చేరలేదు, కేవలం మా నియోజకవర్గాల అభివృద్ధి నిధుల కోసమే ముఖ్యమంత్రిని వినతిపత్రాలతో కలిశాం అని స్వయంగా వాంగ్మూలాలు ఇచ్చుకోవాల్సిన విచిత్రమైన, ఆత్మవంచన చేసుకునే పరిస్థితి వీరికి ఏర్పడింది.కాంగ్రెస్‌లో అనధికారికంగా చేరడం వల్ల వీరు ఒకవైపు బీఆర్ఎస్ పార్టీలో దశాబ్దాలుగా అనుభవించిన హోదా, హక్కులు, కార్యకర్తలపై ఉన్న పట్టును పూర్తిగా కోల్పోయారు. మరోవైపు, అధికారికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అనే ముద్ర పడకపోవడంతో ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యతా లభించడం లేదు. ఇటు బీఆర్ఎస్‌పై హక్కు లేక, అటు కాంగ్రెస్‌లో చట్టబద్ధమైన గుర్తింపు రాక రాజకీయంగా వీరు పూర్తిగా 'రెంటికి చెడ్డ రేవడి'లా మారిపోయారనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గానికి వందల కోట్ల నిధులు వస్తాయని, పనులు శరవేగంగా జరుగుతాయని ఆశించిన ఈ నేతలకు నిరాశే ఎదురవుతోంది. సొంత కాంగ్రెస్ నియోజకవర్గాలకే నిధుల కొరత వేధిస్తున్న తరుణంలో, ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత లభించడం లేదు. చివరకు తమ నియోజకవర్గాల చిన్న చిన్న పనుల కోసం మంత్రులను, అధికారులను కలవాలన్నా, లేదా చివరకు నిధుల కోసం ఫోన్ చేసినా అధికారులు, కాంగ్రెస్ పెద్దలు ఫోన్లు ఎత్తడం లేదని సదరు ఎమ్మెల్యేలు తమ అనుచరుల వద్ద తీవ్ర వేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ పది మందిలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వంటి వారు పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించి, మెల్లగా కాంగ్రెస్ కార్యక్రమాలకు దూరమై తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తన నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించారు. కానీ, దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, ప్రకాష్ గౌడ్ వంటి మిగిలిన నేతలు ఇటు వెనక్కి వెళ్లలేక, అటు ముందుకూ సాగలేక తీవ్రమైన మానసిక సంఘర్షణను అనుభవిస్తున్నారు. కాంగ్రెస్ కేడర్ కూడా వీరిని తమ సొంత నేతలుగా స్వీకరించకపోవడం, పాత కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌లు వీరికి వ్యతిరేకంగా గ్రూపులు కట్టడం వీరి పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది.సొంత పార్టీని వీడి అధికార పక్షంలోకి వెళ్తే అన్నీ బాగుంటాయని అనుకున్న ఈ ఎమ్మెల్యేలకు ప్రస్తుత పరిణామాలు ఒక పెద్ద రాజకీయ పాఠంగా మారాయి. ప్రజామోదం పొందిన పార్టీకి దూరమై, సాంకేతిక చట్టాల చిక్కుల్లో పడి, అధికారంలో ఉన్న పార్టీ నుంచి సరైన గుర్తింపు పొందని ఈ పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తు ప్రస్తుతం తీవ్ర అనిశ్చితిలో పడిపోయింది.

ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల ద్వారా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 14 (న్యూస్ పల్స్) తెలంగాణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలను మాన్యువల్ విధానం నుంచి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లకు మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలి దశలో 15 ఏటీఎస్‌లను ఏర్పాటు చేయనున్నారు. ట్రక్కులు, బస్సులు, కార్లు, జీపులు తదితర వాహనాలను సెన్సర్ల ద్వారా పరీక్షిస్తారు. బ్రేకింగ్ సామర్థ్యం, ఇంజిన్ పనితీరు, కాలుష్య ఉద్గారాలు, ఇతర సాంకేతిక ప్రమాణాలను మెషీన్లు ఆటోమేటిక్‌గా అంచనా వేస్తాయి. ఫలితాలను కేంద్ర వాహన్ పోర్టల్‌లో నేరుగా నమోదు చేస్తారు. కాగా, ఈ ఏటీఎస్ కేంద్రాలను 37 ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో వాహనాల రోడ్డు ఫిట్‌నెస్ పరీక్షల విధానంలో కీలక మార్పు రానుంది. ఇప్పటివరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో మాన్యువల్‌గా నిర్వహిస్తున్న ఫిట్‌నెస్ టెస్టుల స్థానంలో ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) అందుబాటులోకి రానున్నాయి. వాహనం రోడ్డుపై నడవడానికి సురక్షితంగా ఉందా లేదా అన్నది ప్రత్యేక సెన్సర్లు, యంత్రాల ద్వారా శాస్త్రీయంగా పరీక్షించి ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నారు. రవాణా శాఖ తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా 15 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటి ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు రవాణా శాఖ వర్గాలు వెల్లడించాయి. తొలి దశలో ఏర్పాటు చేసే కేంద్రాలను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కార్యాలయాల పరిధిలో రెండు క్లస్టర్లుగా ఏర్పాటు చేయనున్నారు. అనంతరం ఈ నెట్‌వర్క్‌ను మొత్తం 37 ప్రతిపాదిత ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఏటీఎస్‌లో వాహనాన్ని ప్రత్యేక సెన్సర్లతో కూడిన పరికరాలపై నడిపిస్తారు. ఈ ప్రక్రియలో బ్రేకులు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయి, ఇంజిన్ పనితీరు ఎలా ఉంది, వాహనం నుంచి వెలువడుతున్న కాలుష్య ఉద్గారాలు నిర్ణీత ప్రమాణాల్లో ఉన్నాయా వంటి అంశాలను ఆటోమేటిక్‌గా పరీక్షిస్తారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన ఇతర సాంకేతిక ప్రమాణాలను కూడా యంత్రాల ద్వారా పరిశీలిస్తారు. భారీ, మధ్యతరహా వాహనాలతో పాటు లైట్ మోటార్ వెహికల్స్ కూడా ఏటీఎస్ పరిధిలోకి రానున్నాయి. ట్రక్కులు, బస్సులు వంటి హెవీ, మీడియం వాహనాలతో పాటు కార్లు, జీపులు తదితర తేలికపాటి వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో వాహన రకం ఆధారంగా అవసరమైన సాంకేతిక ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలు మాన్యువల్‌గా జరుగుతున్నాయి. ఈ విధానంలో కొన్నిసార్లు వాహనాన్ని పూర్తిస్థాయిలో సాంకేతికంగా పరిశీలించకుండానే పైపైనే చూసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనం నిజంగా రోడ్డు ప్రయాణానికి సురక్షితమైనదేనా అన్న అంశంపై మరింత కచ్చితమైన అంచనా అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ పరీక్షలను ఆటోమేటిక్ చేయం ద్వారా పారదర్శకతను పెంచాలని రవాణా శాఖ భావిస్తోంది. ఏటీఎస్‌లో నిర్వహించిన పరీక్షల ఫలితాలు నేరుగా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖకు చెందిన వాహన్ పోర్టల్‌లో అప్‌లోడ్ అవుతాయి. దీంతో పరీక్షల రికార్డులు డిజిటల్‌గా నమోదవుతాయి. వాహనం ఫిట్‌నెస్‌కు సంబంధించిన సమాచారాన్ని భవిష్యత్‌లో సులభంగా పరిశీలించే అవకాశం ఉంటుంది.

టార్గెట్ రేవంత్...

హైదరాబాద్, ఆగస్టు 14 (న్యూస్ పల్స్) తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణల పర్వం కొత్త మలుపులు తిరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా నేరుగా విమర్శలు చేయడం కంటే, ఆయన కుటుంబ సభ్యులను, ముఖ్యంగా ఆయన సోదరులను టార్గెట్ చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. రేవంత్ రెడ్డి సోదరులు తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డిలు సాధారణంగా తెర వెనుక ఉంటారు. తిరుపతి రెడ్డి ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ వ్యవహారాలు చూసుకుంటుండగా, కొండల్ రెడ్డి వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. వీరిద్దరినీ ఇప్పుడు బీఆర్ఎస్ తమ పొలిటికల్ అటాక్‌కు కేంద్రబిందువుగా మార్చుకుంది.తాజాగా ఈ పొలిటికల్ వార్ టెస్సరాక్ట్ అనే కంపెనీకి జరిగిన భూ కేటాయింపుల చుట్టూ తిరుగుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఈ కంపెనీకి అత్యంత విలువైన భూములను కారుచౌకగా కట్టబెట్టిందని, అసలు ఆ టెస్సరాక్ట్ కంపెనీ కొండల్ రెడ్డి బినామీ సంస్థ అని బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ముఖ్యమంత్రి తన అధికారాన్ని ఉపయోగించి సొంత సోదరుడికి భారీగా లబ్ధి చేకూర్చారని ప్రతిపక్ష నేతలు సోషల్ మీడియా, మీడియాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచార దాడికి దిగారు. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థాయి స్కామ్‌లకు పాల్పడుతోందంటూ బీఆర్ఎస్ శ్రేణులు నెరేటివ్‌ను బలంగా జనాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి.బీఆర్ఎస్ చేస్తున్న ఈ తీవ్రమైన ఆరోపణలను తిప్పికొట్టడంలో కాంగ్రెస్ పార్టీలో కమ్యూనికేషన్ గ్యాప్ స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీలోని సీనియర్ నేతలు, మంత్రులు ఎవరూ ఈ వివాదంపై పెద్దగా స్పందించకపోవడం ప్రతిపక్షాల ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తోంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాత్రమే ఈ అంశంపై స్పందిస్తూ ప్రభుత్వాన్ని డిఫెండ్ చేసే ప్రయత్నం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక విధానం ప్రకారం ఎలాంటి నిబంధనలతో భూములు కేటాయించారో, ఇప్పుడు కూడా సరిగ్గా అదే చట్టబద్ధమైన రూల్స్ పాటిస్తూ పారదర్శకంగా భూములు ఇచ్చామని, ఇందులో ఎలాంటి తప్పిదాలు జరగలేదని ఆయన కుండబద్దలు కొట్టారు. అయితే, ఇక్కడే కాంగ్రెస్ వ్యూహాత్మక లోపం బయటపడుతోంది. పారిశ్రామిక అవసరాల కోసం ఇచ్చిన భూములను కేవలం ఆ నిర్దేశిత ప్రాజెక్టులకు, ఫ్యాక్టరీల నిర్మాణాలకు మాత్రమే ఉపయోగించాలి తప్ప, రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చుకోవడానికి లేదా అమ్ముకోవడానికి చట్టపరంగా అవకాశం ఉండదు. ఈ పాయింట్‌ను కాంగ్రెస్ నేతలు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నారు. భూములు ఎవరికి ఇచ్చినా అందులో స్కామ్ చేసే ఆస్కారం లేదని టెక్నికల్‌గా వివరించడంలో అధికార పక్షం విఫలమవుతోంది.సదరు టెస్సరాక్ట్ కంపెనీకి, సీఎం సోదరుడు కొండల్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ శ్రేణులు కానీ, ప్రభుత్వ ప్రతినిధులు కానీ ధైర్యంగా ఖండించలేకపోతున్నారు. బీఆర్ఎస్ ప్రధానంగా కొండల్ రెడ్డి పేరును వాడుకుని దీనిని ఫ్యామిలీ స్కామ్ గా బ్రాండ్ చేస్తోంటే.. కాంగ్రెస్ మాత్రం కేవలం విధానపరమైన నిబంధనల గురించి మాత్రమే మాట్లాడుతోంది తప్ప, అసలు ఆ కంపెనీ ఓనర్ల వెనుక కొండల్ రెడ్డి ఉన్నారా లేదా అనే దానిపై క్లారిటీ ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కచ్చితమైన ఖండన లేకపోవడం వల్లే బీఆర్ఎస్ తమ ప్రచారంలో మరింత దూకుడు పెంచుతోంది.

మహబూబ్‌నగర్‌లో బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్

మహబూబ్ నగర్, ఆగస్టు 14 (న్యూస్ పల్స్) మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి పరిధిలో 416.18 ఎకరాల భూమిని గుర్తించి సర్వేలు నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చర్చల తర్వాత ఈ ప్రాజెక్టుపై ముందడుగు పడింది. ఈ యూనిట్ ద్వారా స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.మహబూబ్‌నగర్ జిల్లాలో రక్షణ రంగానికి సంబంధించిన ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంటోంది. దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ఈ యూనిట్ కోసం 416.18 ఎకరాల భూమిని అధికారులు గుర్తించి, క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూముల సర్వే విజయవంతంగా పూర్తికాగా.. ప్రస్తుతం పట్టా భూముల పరిశీలన కొనసాగుతోంది. రాష్ట్రంలో రక్షణ రంగ తయారీ కేంద్రం ఏర్పాటు దిశగా ఇది అత్యంత కీలకమైన ముందడుగుగా భావిస్తున్నారు.గత ఏడాది జూలైలో డీఆర్‌డీవో అధికారులు మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించి భౌగోళిక పరిస్థితులను పరిశీలించారు. రవాణా సదుపాయాలు, రోడ్డు, రైలు మార్గాలు అనుకూలంగా ఉండటంతో పాలమూరు ప్రాంతం బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటుకు సరిగ్గా సరిపోతుందని భావించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమై ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా చర్చించారు. కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించడంతో రాష్ట్ర యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగి భూసేకరణ ప్రక్రియను ముమ్మరం చేసింది.దేవరకద్ర మండలంలోని జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి గ్రామాల్లో 416.18 ఎకరాలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. చౌదర్‌పల్లిలో సర్వే నంబర్లు 295, 296 సహా బస్వాయిపల్లి, జీనుగురాల గ్రామాల్లో పట్టా భూముల వివరాలను సేకరించారు. సర్వేకు ముందే గ్రామ పంచాయతీల ద్వారా రైతులకు సమాచారం అందించి వారి సమ్మతితోనే పరిశీలనలు జరుపుతున్నారు. త్వరలోనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి రైతులకు ఆమోదయోగ్యమైన నష్టపరిహారాన్ని నిర్ణయించనున్నారు.పాలమూరులో బ్రహ్మోస్ తయారీ కేంద్రం ఏర్పాటైతే ఈ ప్రాంత ఆర్థిక రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రధాన యూనిట్‌తో పాటు అనుబంధ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, లాజిస్టిక్స్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్, నాణ్యతా ప్రమాదాల విభాగాల్లో సాంకేతిక నిపుణులతో పాటు అడ్మినిస్ట్రేషన్, సెక్యూరిటీ విభాగాల్లో స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

భగత్ సింగ్ నగర్ లో అర్ధరాత్రి పోలీసుల కార్డెన్ సర్చ్

సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో అర్ధరాత్రి పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. సిపి ఆదేశాలతో ఎల్బీనగర్ డిసిపి ఆధ్వర్యంలో ఈ గార్డెన్ సర్చ్ జరిగింది. ఇందులో 33 అనుమతులు లేని చక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అంతేకాదు చలాన్లు ఉన్న వెహికల్ లను గుర్తించి వారి నుండి చలాన్లు వసూలు చేసినట్టు డీసిపి తెలియజేశారు. అంతేకాకుండా అనుమానితులను అలాగే రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు డిసిపి తెలియజేశారు. అక్రమంగా నిల్వ ఉన్న మద్యం బాటిలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. గుట్కా ప్యాకెట్లను కూడా స్వాధీనం చేసుకున్నారు..

విదేశాల్లో భారతీయులపై 7 రెట్లు పెరిగిన దాడులు



విదేశాల్లో ఉంటున్న భారతీయులపై దాడులు గత ఐదేళ్లల్లో 7 రేట్లు పెరిగాయని విదేశాంగ శాఖ రాజ్యసభలో వెల్లడించింది. 2021లో విదేశాల్లో భారతీయులపై దాడులకు సంబంధించి 15 ఘటనలు వెలుగులోకి రాగా 2025 నాటికి ఈ సంఖ్య 104కు చేరిందిభారతీయులపై హింసాత్మక దాడి ఘటనలు అత్యధికంగా యూఎస్, యూఏఈ, యూకే, కెనడాల్లో వెలుగుచూశాయి. మొత్తం 36 దేశాల గణాంకాలను విదేశాంగ శాఖ రాజ్యసభ ముందుంచింది. అమెరికాలో గత ఐదేళ్లల్లో భారతీయులకు సంబంధించి 33 కేసులు వెలుగు చూశాయి. యూఏఈలో 32 కేసులు, యూకేలో 31, కెనడాలో 30 కేసులు వెలుగు చూశాయి. ఇక ఐర్లాండ్‌లో గత ఐదేళ్లల్లో భారతీయులపై 24 హింసాత్మక దాడులు జరగ్గా, రష్యాలో 23, జర్మనీలో 19 ఉదంతాలు బయటపడ్డాయి. 2021-25 మధ్య కాలంలో మొత్తం 302 దాడి కేసులు వెలుగు చూడగా 2025లో అత్యధికంగా 104 హింసాత్మక ఘటనలు జరిగాయి.భారతీయులపై హింసాత్మక దాడుల పెరుగుదలో ఏటా హెచ్చుతగ్గులు ఉన్నాయని గణాంకాల్లో తేలింది. యూఎస్ఏలో 2021లో ఒక్క ఘటన బయటపడగా, 2022లో ఆరు, 2023లో ఒకటి, 2024లో 11, 2025లో 14 దాడి ఘటనలు జరిగాయి. ఇక యూకేలో 2021లో ఒక దాడి ఘటన వెలుగు చూసింది. 2022లో నాలుగు ఉదంతాలు, 2023లో పదకొండు, 2024లో పది, 2025లో ఐదు వెలుగు చూశాయి. ఇక కెనడాలో 2021లో భారతీయులపై దాడులకు సంబంధించి మూడు కేసులు వెలుగు చూడగా2022, 2023 సంవత్సరాల్లో ఆరు కేసుల చొప్పున నమోదయ్యాయి. 2024లో ఏడు, 2025లో 8 దాడి ఘటనలు వెలుగు చూశాయి. మాలీలో 2021-24 మధ్య కాలంలో ఒక్క కేసు కూడా లేకపోగా 2025 ఏకంగా 11 కేసులు వెలుగు చూశాయి.విదేశాల్లో భారతీయుల భద్రతే తమకు అత్యంత ముఖ్యమని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. భారతీయ ఎంబసీలు, సిబ్బంది అక్కడి భారతీయుల విషయంలో నిత్యం అప్రమత్తంగా ఉంటున్నారని పేర్కొన్నారు.

వాట్సాప్ గ్రూప్ ద్వారా నగరంలో గంజాయి సప్లై..

ఈగల్ పోలీసుల ఆపరేషన్

హైదరాబాద్ :వాట్సాప్ గ్రూప్ ద్వారా నగరంలో గంజాయి సప్లై పై వచ్చిన సమాచారంలో ఈగల్ పోలీసులు ఆపరేషన్ నిర్వహించారు. బేగంపేట్ ఓల్డ్ ఎయిర్పోర్ట్ వద్ద అనుమానితుడి అరెస్ట్ చేసి, 50 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో కిరణ్, దుర్గాప్రసాద్, కమలాకర్ పేర్లు వెలుగులోకి వచ్చాయి. దాంతో బాలానగర్ రాజీవ్ కాలనీలో నిందితులపై నార్కోటిక్ టీమ్స్ దాడులు నిర్వహించాయి. వచ్చిన పోలీసులపై స్క్రూడ్రైవర్తో దాడికి నిందితుడు కిరణ్ ప్రయత్నించాడు. నాలుగో ఫ్లోర్ నుంచి దూకి ఆత్మహత్య డ్రామా ఆడాడు. కిరణ్ నుంచి 14 కేజీల గంజాయి, ఎయిర్గన్, కారు, బైక్, మొబైల్ ఫోన్లు సీజ్ చేసారు. ఒడిశా నుంచి నగరానికి గంజాయి సరఫరా చేసినట్లు గుర్తించారు. ఒడిశాకు చెందిన ఐదుగురు అదుపులోకి తీసుకున్నారు. ప్యాకెట్ ఫొటోను ముందుగా కస్టమర్కు పంపి.. డెలివరీ అనంతరం స్పాట్ నుంచి ముఠా పరారవుతుంది. 2022 నుంచి ఇప్పటివరకు 203 మందికి గంజాయి సప్లై చేసినట్లు పోలీసులు గుర్తించారు. 40 పోలీస్ టీములతో ఈ భారీ ఆపరేషన్ జరిగింది.

భారత్ సహనాన్ని బలహీనతగా భావించొద్దు.. ఎన్ఎస్ఏ అజిత్ డోభాల్ వార్నింగ్

భారత్ సహనాన్ని బలహీనతగా భావించొద్దని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ డోభాల్ హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్పై డిస్కవరీలో త్వరలో ప్రసారం కానున్న డాక్యుమెంటరీ సిరీస్లో భాగంగా ఎన్ఎస్ఏ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్పై ఎన్ఎస్ఏ ఇంటర్వ్యూ ఇవ్వడం ఇదే తొలిసారి. పహల్గాం దాడి తరువాత భారత్ ఆపరేషన్ సిందూర్ చెపట్టిన సమయంలో పరిస్థితులపై అజిత్ డోభాల్ ఈ డాక్యూసిరీస్లో పలు కీలక వివరాలను వెల్లడించారు.ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలు ఏమిటో ముందస్తుగానే నిర్ణయించుకున్నామని అజిత్ డోభాల్ తెలిపారు. పహల్గాం దాడి వెనకున్న ఉగ్రవాద క్యాంపులను ధ్వంసం చేయడమే తమ టార్గెట్ అని పేర్కొన్నారు. ఉగ్రవాద చర్యలపై భారత్ దీటుగా స్పందిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ఆపరేషన్ సిందూర్తో పంపామని చెప్పారు.'ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాము. భారత దేశ సహనాన్ని బలహీనతగా భావించి పొరపాటు చేయొద్దు. భారత్ ఎంతటి రిస్క్నైనా తీసుకోగలదు. పర్యావసానాలను లెక్క చేయకుండా దాడులు చేయగలదు' అని ఆయన అన్నారు. డోభాల్తో పాటు ఈ ఆపరేషన్ వెనకున్న పలువురు అధికారులు తమ అనుభవాలను ఈ డాక్యుమెంటరీలో వెల్లడించారు.శనివారం రాత్రి 9 గంటలకు డిస్కవరీలో, డిస్కవరీ+ ఓటీటీ ప్లాట్ఫామ్లో ఈ డాక్యుమెంటరీ ప్రసారం కానుంది. కశ్మీర్లోని పహల్గాంలో జరిగిన దాడులకు ప్రతీకారంగా భారత్ గతేడాది మే7న ఆపరేషన్ సిందూర్ను లాంచ్ చేసిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో పలు ఉగ్రవాద స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఆ తరువాత 88 గంటల పాటు ఇరు దేశాలు పరస్పర దాడులు చేసుకున్నాయి. మే 10న పాక్ ప్రతిపాదించిన కాల్పుల విరమణకు భారత్ అంగీకరించింది.

కరూర్ తొక్కిసలాట బాధితులకు ప్రభుత్వ జాబ్స్.. హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే

కరూర్ తొక్కిసలాటలో మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడాన్ని రద్దు చేస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు తాజాగా స్టే విధించింది. దీంతో, తమిళనాడు సీఎం విజయ్‌కు స్వల్ప ఊరట లభించినట్లైంది. ఈ కేసులో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్‌లతో కూడిన ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. బాధితులకు నగదు రూపంలో సాయం చేస్తే అభ్యంతరం చెప్పే వారా? అని పిటిషనర్లను ప్రశ్నించింది. కుటుంబంలోని సంపాదన పరుడైన ఒకే ఒక వ్యక్తి మరణిస్తే కుటుంబసభ్యుల్లో ఎవరోకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి అభ్యంతరం చెబుతారా? ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించేందుకు మీరెవరు? అని ప్రశ్నించింది.



గతేడాది టీవీకే ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో తొక్కిసలాటలో పలువురు మరణించిన విషయం తెలిసిందే. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీవీకే అధినేత విజయ్ మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తూ జీవో జారీ చేశారు.అయితే, ఈ జీవోను జులై 27న హైకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 14, 15ను ప్రభుత్వ జీవో ఉల్లంఘిస్తోందని అభిప్రాయపడింది. ప్రతి ప్రభుత్వ విభాగంలో కారుణ్య నియామకాలు ఆశిస్తున్న వారు ఎందరో ఉంటారని ఈ సందర్భంగా హైకోర్టు అభిప్రాయపడింది. వారి అవసరాలను పక్కన పెట్టి కరూర్ తొక్కిసలాట బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు ముందుగా ఇవ్వడం సబబు కాదని పేర్కొంది. ఆర్టికల్ 162 ప్రకారం ఈ జీఓ జారీ చేశామన్న ప్రభుత్వ వాదనను సైతం కోర్టు తోసిపుచ్చింది. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అధికారాలు వినియోగించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల్లో ప్రభుత్వ తప్పిదాలు ఉండే అవకాశం ఉన్నప్పటికీ బాధితులకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వని విషయాన్ని కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ కేసులో కారుణ్య నియామకాలకు అనుమతిస్తే ఒక ప్రమాదకరమైన ఒరవడికి నాంది పలికినట్లు అవుతుందని హైకోర్టు అప్పట్లో పేర్కొంది.

అంగరంగ వైభవంగా శ్రీ మహాత్మ బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ.

ఆవిష్కరణలో పాల్గొన్న కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

రంగారెడ్డి : షాద్‌నగర్‌లో వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో, బొబ్బిలి ప్రవీణ్ నేతృత్వంలో శ్రీ మహాత్మ బసవేశ్వర స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు.అనంతరం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... మహానీయుడు, భగవత్ స్వరూపుడైన శ్రీ మహాత్మ బసవేశ్వర స్వామి విగ్రహాన్ని షాద్‌నగర్‌లో ప్రతిష్ఠించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమానికి కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య హాజరు కావడం మరింత ప్రత్యేకతను సంతరించుకుందని తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు.బసవేశ్వరుడు కారణజన్ముడని, సమాజంలోని అసమానతలను తొలగించేందుకు తన జీవితాన్ని అంకితం చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.లింగ,మత,కుల వివక్షకు తావులేకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమే అనే భావనను ఆయన ఆనాడే చాటిచెప్పారని అన్నారు. మానవత్వంతో మెలుగుతూ సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలన్న బసవేశ్వరుడి సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. ఆయన ఆశయాలను పాటిస్తే సమాజంలో శాంతి, సమానత్వం నెలకొంటాయని పేర్కొన్నారు.కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం అధ్యక్షతన శ్రీ మహాత్మ బసవేశ్వర స్వామి విగ్రహావిష్కరణ జరగడం ఆనందంగా ఉందన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి భక్తుడిపై కాశీ విశ్వేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.మహాత్మ బసవేశ్వరుడు దేవుడి స్వరూపంగా జన్మించి సమాజాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు గొప్ప కార్యక్రమాన్ని చేపట్టారని జగద్గురు కొనియాడారు. ఆయన చూపిన మార్గం కేవలం కర్ణాటక రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా సమాజ అభ్యున్నతికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు.స్త్రీ, పురుష భేదం లేకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ సమానమే అనే బసవేశ్వరుడి సిద్ధాంతాలను ప్రజలు ఆచరించాలని పిలుపునిచ్చారు.ఢిల్లీ నుంచి చిన్నచిన్న గ్రామాల వరకు ప్రముఖ క్షేత్రాలు, ప్రాంతాల్లో బసవేశ్వరుని విగ్రహాలు ఉండాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. షాద్‌నగర్‌లో బసవేశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేసిన బొబ్బిలి ప్రవీణ్, వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులను అభినందించారు.కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం నాయకులు, పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంధ్ర నేతల మోచేతి నీళ్లు తాగే వారు నేడు ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తున్నారు

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని వారు, ఆంధ్ర నాయకుల మోచేతి నీళ్లు తాగే వారు నేడు ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తుండటం బాధాకరమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడతానని స్పష్టం చేశారు. రవీంద్రభారతిలో కళాకారుడు ఏపూరి సోమన్న 25 ఏళ్ల పాటల ప్రస్థానంపై రూపొందించిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి రాజగోపాల్‌రెడ్డి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తొలిసారిగా గళం విప్పింది తానేనని, అందుకే అప్పటి సీఎం కేసీఆర్ తనను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. మునుగోడు ఉపఎన్నికలో తనను ఓడించేందుకు 100 మంది ఎమ్మెల్యేలను రంగంలోకి దించినా, దానిని కూడా తాను ఒక విజయంగానే భావిస్తున్నానని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో లక్షల కోట్ల రూపాయలను దోచుకుంటోందని ఆయన ఆరోపించారు. ఏపూరి సోమన్న పాడిన 'ఎవరి పాలైందిరో తెలంగాణ' పాటలో ప్రస్తావించిన పరిస్థితులే నేటికీ కొనసాగడం బాధాకరమన్నారు. సోమన్న రూపం, గళం చూస్తే దివంగత ప్రజాగాయకుడు గద్దర్ గుర్తుకొస్తారని పేర్కొన్నారు. ఏపూరి సోమన్న వంటి కళాకారులు, ఉద్యమకారులకు తాను అండగా ఉంటానని, వచ్చే ఎన్నికల్లో సోమన్న చట్టసభల్లో అడుగుపెడతారని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. రాజకీయాలను మార్చే శక్తి తనకు ఉందని, నిజాయితీ కలిగిన వారు తన వెంట నిలిస్తే తమిళనాడు తరహాలో రాజకీయ మార్పు తీసుకురాగలమని ధీమా వ్యక్తం చేశారు. తాను గెలిపించిన ఓ ఎమ్మెల్యే కులం కార్డును అడ్డుపెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. పదవులు కిరీటాలు కావని, ప్రజలకు సేవ చేసే అవకాశం మాత్రమేనని రాజగోపాల్‌రెడ్డి హితవు పలికారు.

నేను కూడా సైబర్ క్రైమ్ బాధితుడినే: నాగార్జున



హైదరాబాద్, ఆగస్టు 14 : తాను కూడా సైబర్ క్రైమ్ బాధితుడినే అని ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున వ్యాఖ్యానించారు. నాలుగేళ్ల క్రితం సైబర్ మోసానికి గురయ్యానని ప్రస్తావించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఈరోజు (శుక్రవారం) నిర్వహించిన సురక్ష కా తిరంగా సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగార్జున హాజరయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సైబర్ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా నాగార్జున ప్రసంగించారు. తనకు ఓ బ్యాంక్ అధికారి పేరుతో గతంలో కాల్ వచ్చిందని తెలిపారు.

ఆ కాల్ నిజమని నమ్మా..

'నాగార్జున గారు.. మీరు బిజినెస్‌లో చాలా స్మార్ట్ అని విన్నాను.. మరి ఎందుకు ఇన్వెస్ట్ చేయడం లేదు. చాలా గొప్ప లాభాలు ఇచ్చే స్కీమ్ ఇదని ఆ వ్యక్తి నన్ను మాయ చేశాడు' అని తెలిపారు. సాధారణంగా తన ఆర్థిక వ్యవహారాలన్నీ తన మేనేజర్ చూసుకుంటారని చెప్పారు. కానీ.. నేరుగా తనకు కాల్ చేసే సరికి నిజమని నమ్మానని నాగార్జున అన్నారు.

ఇరాన్‌లోనూ మోసం చేయబోయి..అలాగే, ఇరాన్‌లో జరిగిన మరో విషయం గురించి నాగార్జున ప్రస్తావించారు. 'నా బంధువు ఒకరు షూటింగ్ కోసం ఇరాన్ వెళ్లినప్పుడు... ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయిన కొన్ని నిమిషాలకే మాకు ఓ వీడియో కాల్ వచ్చింది. మేము పోలీసులమని.. మీ బ్యాగేజ్‌లో నార్కోటిక్ డ్రగ్స్ ఉన్నాయి. మీ రూమ్ నుంచి కదలవద్దని అంటూ.. ఆ వీడియో కాల్‌లో చెప్పారు. కానీ నాకు ఈ సైబర్ ఫ్రాడ్‌పై అవగాహన ఉండటంతో.. వెంటనే పోలీసులకు కాల్ చేశా' అని నాగార్జున పేర్కొన్నారు.

ప్రతీ 15 రోజులకు నా పాస్‌వర్డ్ అన్నీ మారుస్తా..ప్రతీ 15 రోజులకు ఒకసారి తాను తన పాస్‌వర్డ్స్ అన్నీ మారుస్తానని నాగార్జున ప్రస్తావించారు. తన ఫోన్‌లో తాను ఒక్క ఫొటో కూడా తీసుకోనని చెప్పుకొచ్చారు. చాలా అప్రమత్తంగా ఉంటానని తెలిపారు. సైబర్ క్రైమ్‌ను అరికట్టడంలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్‌గా ఉండటం చాలా గొప్ప విషయమని తెలిపారు. ఇది తెలంగాణ పోలీసుల గొప్పతనమని కొనియాడారు. పైరసీని అరికట్టడంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, హైదరాబాద్ సీపీ సజ్జనార్ చాలా కృషి చేశారని పేర్కొన్నారు. తెలుగు ఫిలిం ఇండస్ట్రీకే కాకుండా, ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీకి కూడా డీజీపీ ఆనంద్, సీపీ సజ్జనార్ చాలా మేలు చేశారని నాగార్జున పేర్కొన్నారు.

విదేశాల్లో భారతీయులపై 7 రెట్లు పెరిగిన దాడులు

విదేశాల్లో ఉంటున్న భారతీయులపై దాడులు గత ఐదేళ్లల్లో 7 రేట్లు పెరిగాయని విదేశాంగ శాఖ రాజ్యసభలో వెల్లడించింది. 2021లో విదేశాల్లో భారతీయులపై దాడులకు సంబంధించి 15 ఘటనలు వెలుగులోకి రాగా 2025 నాటికి ఈ సంఖ్య 104కు చేరింది.భారతీయులపై హింసాత్మక దాడి ఘటనలు అత్యధికంగా యూఎస్, యూఏఈ, యూకే, కెనడాల్లో వెలుగుచూశాయి. మొత్తం 36 దేశాల గణాంకాలను విదేశాంగ శాఖ రాజ్యసభ ముందుంచింది. అమెరికాలో గత ఐదేళ్లల్లో భారతీయులకు సంబంధించి 33 కేసులు వెలుగు చూశాయి. యూఏఈలో 32 కేసులు, యూకేలో 31, కెనడాలో 30 కేసులు వెలుగు చూశాయి. ఇక ఐర్లాండ్‌లో గత ఐదేళ్లల్లో భారతీయులపై 24 హింసాత్మక దాడులు జరగ్గా, రష్యాలో 23, జర్మనీలో 19 ఉదంతాలు బయటపడ్డాయి. 2021-25 మధ్య కాలంలో మొత్తం 302 దాడి కేసులు వెలుగు చూడగా 2025లో అత్యధికంగా 104 హింసాత్మక ఘటనలు జరిగాయి.భారతీయులపై హింసాత్మక దాడుల పెరుగుదలో ఏటా హెచ్చుతగ్గులు ఉన్నాయని గణాంకాల్లో తేలింది. యూఎస్ఏలో 2021లో ఒక్క ఘటన బయటపడగా, 2022లో ఆరు, 2023లో ఒకటి, 2024లో 11, 2025లో 14 దాడి ఘటనలు జరిగాయి. ఇక యూకేలో 2021లో ఒక దాడి ఘటన వెలుగు చూసింది. 2022లో నాలుగు ఉదంతాలు, 2023లో పదకొండు, 2024లో పది, 2025లో ఐదు వెలుగు చూశాయి. ఇక కెనడాలో 2021లో భారతీయులపై దాడులకు సంబంధించి మూడు కేసులు వెలుగు చూడగా2022, 2023 సంవత్సరాల్లో ఆరు కేసుల చొప్పున నమోదయ్యాయి. 2024లో ఏడు, 2025లో 8 దాడి ఘటనలు వెలుగు చూశాయి. మాలీలో 2021-24 మధ్య కాలంలో ఒక్క కేసు కూడా లేకపోగా 2025 ఏకంగా 11 కేసులు వెలుగు చూశాయి.విదేశాల్లో భారతీయుల భద్రతే తమకు అత్యంత ముఖ్యమని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. భారతీయ ఎంబసీలు, సిబ్బంది అక్కడి భారతీయుల విషయంలో నిత్యం అప్రమత్తంగా ఉంటున్నారని పేర్కొన్నారు.

నాకు, విద్యార్థులకు మధ్య జోక్యం చేసుకోవద్దు: చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

నల్సార్ విశ్వవిద్యాలయ విద్యార్థులపై చర్యలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సిద్ధమైనందుకు చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా సూర్యకాంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తనకూ, విద్యార్థులకు మధ్య జోక్యం చేసుకునేందుకు వారెవరని ప్రశ్నించారు.2026 బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా చేర్చుకోవద్దంటూ రాష్ట్ర కౌన్సిల్స్‌ను బీసీఐ ఆదేశించిన విషయం తెలిసిందే. యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐని ముఖ్యఅతిథిగా ఆహ్వానించడంపై విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఘటనపై విచారణ జరపాలని కూడా యూనివర్సిటీని కోరింది. ఈ నిర్ణయంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. చివరకు ఈ అంశం సుప్రీం కోర్టుకు చేరింది.ఈ పరిణామాలపై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. బీసీఐ జోక్యం ఎంతమాత్రం అవసరం లేదని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. ఇది విద్యార్థులకు, తనకు మధ్య ఉన్న అంశమని స్పష్టం చేశారు. బీసీఐకి ఈ అంశంలో ఎలాంటి నిమిత్తం లేదని అన్నారు. విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు ఉందని కూడా స్పష్టం చేశారు. బీసీఐ అనవసరంగా జోక్యం చేసుకుందని కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఏబీవీకి ఏమైంది

విజయవాడ, ఆగస్టు 14 రాజకీయాల్లో శత్రువుకి శత్రువు మిత్రుడు కావడం ఎంత సహజమో, ఐడియాలజీ లేదా స్వప్రయోజనాల విషయంలో విభేదాలు వస్తే నిన్నటి మిత్రుడే నేడు తీవ్ర విమర్శకుడిగా మారడం కూడా అంతే సహజం. మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు విషయంలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జరుగుతున్న చర్చ సరిగ్గా ఈ సమీకరణాల చుట్టూనే తిరుగుతోంది. వైఎస్సార్సీపీ హయాంలో కక్షసాధింపు చర్యలకు గురయ్యారనే సానుభూతితో, ఆయనకు అండగా నిలిచిన టీడీపీ శ్రేణులు.. నేడు ఆయన మారుతున్న వైఖరిని చూసి తీవ్రగ్రాఫ్ంతికి గురవుతున్నాయి ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్‌కు గురై, తీవ్ర కేసులను ఎదుర్కొన్న సమయంలో టీడీపీ శ్రేణులు, మీడియా ఆయనను ఒక బాధితుడిగా ' భావించి పూర్తి స్థాయిలో మద్దతుగా నిలిచాయి. ప్రభుత్వ యంత్రాంగం ఆయనపై చూపిన కఠిన వైఖరిని తప్పుబడుతూ ఆయనకు సుదీర్ఘ పోరాటంలో అండగా నిలిచాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనపై ఉన్న సీఐడీ కేసులు, విచారణలను పక్కనబెట్టి, ఆయన వివాదాలకు ముగింపు పలికి క్లీన్ చిట్ లభించేలా చట్టబద్ధమైన ఊరట నిచ్చింది. అయితే, ఆ తర్వాత ఏబీ వెంకటేశ్వరరావు అనుసరిస్తున్న తీరు, ఆయన మాటల శైలి టీడీపీ క్యాడర్‌కు తీవ్ర మింగుడుపడటం లేదు.ఇటీవలి కాలంలో ఆయన ప్రభుత్వ ప్రాజెక్టులు, పాలనాపరమైన నిర్ణయాలపై తీవ్ర విమర్శలు గుప్పిస్తుండటం చర్చనీయాంశమైంది. రాయలసీమ ప్రాజెక్టులైన కడప స్టీల్ ప్లాంట్‌పై స్పందిస్తూ.. అది కేవలం ఒక రోలింగ్ మిల్ మాత్రమేనని, సమగ్ర స్టీల్ ప్లాంట్ కాదంటూ ప్రెస్ మీట్లు పెట్టి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. గతంలో ఆయనను తీవ్రంగా వేధించిన, ట్రోల్ చేసిన వైఎస్సార్సీపీ సానుభూతి మీడియా ఛానెళ్లకు, యూట్యూబ్ వేదికలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇస్తూ, కూటమి ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపట్టడం ద్వారా ఆయన పూర్తిగా ప్రత్యర్థి ఫోల్డ్‌లోకి వెళ్లిపోయారనే భావన వ్యక్తమవుతోంది.వ్యక్తిగత అజెండాలు లేదా ప్రభుత్వంపై పెంచుకున్న తీవ్రమైన అసంతృప్తి వల్ల విచక్షణ కోల్పోయి, లేనిపోని అంశాలపై విమర్శలు చేస్తున్నారనే విమర్శలు ఆయనపై వస్తున్నాయి. గతంలో ఆయన పడిన కష్టాలకు మద్దతుగా నిలిచి, ఆయనను నెత్తిన పెట్టుకున్న టీడీపీ క్యాడర్ ఇప్పుడు ఇలాంటి వ్యక్తినా మనం సమర్థించింది అని తీవ్ర అసంతృప్తితో ఉంది. ఒక మాజీ ఐపీఎస్ అధికారిగా చట్టబద్ధమైన హక్కుల కోసం పోరాడటానికి, రాజకీయ ప్రయోజనాల కోసం మారే వైఖరికి మధ్య ఉన్న సన్నని గీత దాటడం వల్ల ఏబీ వెంకటేశ్వరరావు తన సొంత విశ్వసనీయతను దెబ్బతీసుకున్నారు

పెద్దిరెడ్డి మళ్లీ యాక్టివ్...

తిరుపతి, ఆగస్టు 14 మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి యాక్టివ్ అయ్యారు. తాజాగా ఆయన అనంతపురం జిల్లాలో నిర్వహించిన డీఎస్సీ-2025 వ్యతిరేక నిరసనల్లో పాల్గొనేందుకు వెళ్లారు. అయితే.. పోలీసులు ఆయనను మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ పరిణామం సీమ వైసీపీలో కొంత జోష్ నింపిందన్న వాదన వినిపిస్తోంది. గత రెండు సంవత్సరాలుగా.. పార్టీ పరంగా ఉద్యమాలు చేపట్టినా.. పెద్దిరెడ్డి పెద్దగా యాక్టివ్ కాలేదు. కుటుంబంపై నమోదైన కేసులు ఆయనను ఇబ్బందికి గురి చేశాయన్న వాదన ఉంది ముఖ్యంగా భూములు, మద్యం, అటవీ భూమిని ఆక్రమించి ఇల్లు కట్టుకున్నారన్న కేసులు కూడా నమోదయ్యాయి. అయితే.. వాటిపై పార్టీ పరంగా ఆయనకు మద్దతు లభించలేదు. దీంతో పెద్దిరెడ్డి కినుక వహించారని.. పార్టీలో కూడా అన్యమనస్కంగా ఆయన ఉంటున్నారన్నది కొన్నాళ్ల కిందటే చర్చకు వచ్చింది. అయితే.. తాజాగా .. పెద్ది రెడ్డి మనసు మార్చుకున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోవడం.. నియోజకవర్గంలో కూడా కేడర్ బల హీన పడుతుండడం, నాయకుల మధ్య సమన్వయం సమస్యగా మారుతున్న నేపథ్యంలో ఉద్యమాలకు హాజర య్యారన్న టాక్ వినిపిస్తోంది. పెద్దిరెడ్డి ఇప్పటి వరకు కేవలం ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాలకు మాత్రమే పరిమితం అయ్యారు. గతంలో చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. గత 2024 ఎన్నికల్లో చంద్రబాబును ఓడించాలని నిర్ణయించారు. కానీ, ఈ తరహా రాజకీయాలు పనిచేయలేదు. దీంతో గత ఎన్నికల తర్వాత నుంచి పెద్దిరెడ్డి మౌనంగా ఉండిపోయారు. ఒకవైపు మదనపల్లి ఫైల్స్ తగలబడడం, మద్యం కేసు వెంటాడడం, భూముల వ్యవహారంతో తీరికలేకుండా పోయింది. మరోవైపు మరిన్ని కేసులు నమోదవుతాయన్న బెంగ కూడా ఆయనను వెంటాడింది.ఈ పరిణామాల క్రమంలో మౌనంగా ఉన్న పెద్దిరెడ్డి.. తాజాగా యాక్టివ్ కావడం కొంత మేరకు సీమలో వైసీపీకి కలిసి వస్తుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే.. పూర్తిస్థాయిలో ఇది కొనసాగుతుందా? లేదా? అనేది చూడాలి. కేవలం తాడిపత్రి వరకే పెద్దిరెడ్డి రాజకీయంగా పరిమితం అవుతారా? అనేది కూడా సందేహంగా మారింది. అయితే.. ఇది కొంత మేరకు సానుకూల పరిణామాలను అందిస్తున్నదన్న సంకేతాలు కూడా ఉన్నాయి. సీమలో పెద్ది రెడ్డి వంటి సీనియర్ యాక్టివ్ కావాలని కోరుకునే వారికి మాత్రం తాజా పరిణామం కొంత మేరకు సంతృప్తిని ఇచ్చిందని అంటున్నారు.

తిరుమల శ్రీవారి భక్తుల వసతి కష్టాలకు చెక్

తిరుమల, ఆగస్టు 14 : తిరుమల శ్రీవారి భక్తుల వసతి కష్టాలకు చెక్ పెడుతూ టీటీడీ కొత్తగా నిర్మించిన రెండు వసతి సముదాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. తిరుపతిలో భక్తుల కోసం నిర్మించిన శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాలను బ్రహ్మోత్సవాల సమయంలో ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ రెండు వసతి సముదాయాలలో దాదాపు 10,000 మంది భక్తులకు వసతి కల్పించవచ్చు. మొత్తం వెయ్యికిపైగా గదులు అందుబాటులోకి రానున్నాయి.. తిరుమలలో 60 వేల మంది యాత్రికులకు వసతి కల్పించేలా 7600 గదులు, 5 పీఏసీలు ఉన్నాయి. తిరుమలలో ప్రస్తుతం ఉన్న వసతి గదులు భక్తులకు సరిపోవడం లేదు.. అలాగని కొత్తగా అక్కడ సముదాయాలు నిర్మించలేని పరిస్థితులు ఉన్నాయి. ఒకవేళ తిరుమలలో వసతి గదులు దొరకకపోతే భక్తుల కోసం తిరుపతిలో శ్రీనివాసం, మాధవం, విష్ణునివాసం, పద్మావతి అతిథి గృహం ఉన్నాయి. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో వసతి గదులు సరిపోవడం లేదు.. ఈ సమస్యకు చెక్ పెట్టేలా కొత్తగా నిర్మించిన మరో రెండు వసతి సముదాయాలు అందుబాటులోకి రాబోతున్నారు.తిరువతి రైల్వే స్టేషన్ వెనుక గోవిందరాజస్వామి సత్రాల స్థానంలో కొత్తగా నిర్మిస్తున్న శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాల పనులు ముగింపు దశకు వచ్చాయి. ప్రధాన భవనాలు, గదుల నిర్మాణం పూర్తికాగా.. విద్యుత్, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. వచ్చే నెలలో జరగబోయే బ్రహ్మోత్సవాల సమయంలో వీటిని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాలను దాదాపు రూ.600 కోట్ల వ్యయంతో, అధునాతన వసతులతో నిర్మిస్తున్నారు.

పాపం గోరంట్ల

అనంతపురం, ఆగస్టు 14 పోలీస్ ఖాకీ డ్రెస్ వదిలి, ఎంపీ గిరీ అనుభవించి ఒక వెలుగు వెలిగిన హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ రాజకీయ జీవితం ప్రస్తుతం అత్యంత దిగువ స్థాయికి వడిపోయింది. 2019లో వైఎస్సార్సీ పీ తరఫున పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఆయన, వదవీకాలంలో వివాదాలతో వార్తల్లో నిలిచారు. 2024 ఎన్నికల్లో ఆయనకు టికెట్ నిరాకరించిన పార్టీ అధిష్ఠానం, ఆ తర్వాత ఏదో పేరుకే అన్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి పదవి కట్టబెట్టింది. అయితే, పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా.. పార్టీ తాడేపల్లి ఆఫీసు ఆవరణలో కూడా ఆయనకు పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదన్నది ఓపెన్ సీక్రెట్.ఉమ్మడి అనంతపురం జిల్లాలో గోరంట్ల మాధవ్‌కు అసలు ఒక్క నియోజకవర్గ బాధ్యత కూడా లేదు. పార్టీ హైకమాండ్ ఆయనకు జిల్లాలో ఏ అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఇన్‌చార్జ్ పదవినీ అప్పగించలేదు. అధికార ప్రతినిధిగా కనీసం తాడేపల్లిలో ప్రెస్ మీట్లు పెట్టి పార్టీ వాయిస్ వినిపించే అవకాశం కూడా సక్రమంగా దక్కడం లేదనే చర్చ నడుస్తోంది. దీంతో తాను ఇంకా రాజకీయాల్లో ఉనికిలోనే ఉన్నానని ప్రపంచానికి చెప్పుకోవడానికి మాజీ ఎంపీ పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో ఎక్కడో ఒకచోట ధర్నా జరుగుతోందంటే చాలు.. పిలవకపోయినా వెళ్లి ప్రత్యక్షమైపోవడం ఆయనకు అలవాటుగా మారిందనే విమర్శలు ఉన్నాయి.ఇటీవల రాప్తాడు నుంచి మొదలుకుని ఉరవకొండలో విశ్వేశ్వరరెడ్డి తలపెట్టిన నిరసనల వరకు, పార్టీ ఎక్కడ రోడ్డెక్కినా మాజీ ఎంపీ హడావుడిగానే చేరుకుంటున్నారు. ధర్నాల దగ్గర పోలీసులు అడ్డుకుంటే వారితో వాగ్వాదానికి దిగడం, బలవంతపు అరెస్టులు కావడం, ఆ క్రమంలో కొత్త కొత్త కేసులు మూటగట్టుకోవడం ఆయనకు నిత్యకృత్యంగా మారింది. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఈ రకమైన ఓవర్ ఆక్షన్ చేస్తున్నారని, ఈ హడావుడి వల్ల ఎలాంటి రాజకీయ లబ్ధి కలగపోగా పోలీసు కేసులు, కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోంది.గతంలో గౌరవప్రదమైన సీఐ ఉద్యోగాన్ని వదులుకుని రాజకీయాల్లోకి వచ్చిన గోరంట్ల మాధవ్, ఇప్పుడు ఇటు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోస్టు లేక, అటు పార్టీ అధినేత జగన్ ఆశీస్సులు దక్కక తీవ్ర రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. ఆవేశంగా మాట్లాడటం, ప్రతిదానికీ హైడ్రామా సృష్టించడం తప్పితే సొంతంగా కేడర్‌ను లేదా నియోజకవర్గంలో వట్టును పెంపొందించుకోవడంలో ఆయన విఫలమయ్యారనేది సొంత పార్టీ నేతల భావన. రేపోమాపోఆయన తనను పార్టీ హైకమాండ్ వాడుకుని వదిలేసిందని.. బోరుగడ్డలాగా ధర్నా చేసినా ఆశ్చర్యం లేదన్న భావన వినిపిస్తోంది.

కుప్పం ఎయిర్ పోర్టుపై తమిళ రాజకీయాల్లో చర్చ

తిరుపతి, ఆగస్టు 14 ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో నిర్మించనున్న విమానాశ్రయం ప్రాజెక్టు ఇప్పుడు పొరుగు రాష్ట్రం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆ రాష్ట్రంలోని హోసూరు విమానాశ్రయ నిర్మాణానికి ఆటంకం కలుగుతోందని, దీని వెనుక పొరుగు రాష్ట్రాల ప్రమేయం ఉందనే ఆరోపణలతో తమిళనాడు అసెంబ్లీలో ప్రకంపనలు రేగాయి. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా డిఎంకే ఎమ్మెల్యే శ్రీనివాసన్ లేవనెత్తిన అంశం రాష్ట్రంలో రాజకీయ దుమారాన్ని రేపింది. హోసూరు విమానాశ్రయ ప్రాజెక్టును దెబ్బతీయడానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు కావాలనే అడ్డువుల్లలు వేస్తున్నాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. హోసూరు వంటి కీలక ప్రాంతంలో విమానాశ్రయం రావడం వల్ల పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని, అయితే పొరుగు రాష్ట్రాలు వ్యూహాత్మకంగా ఆ ప్రాజెక్టును ఆపేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారుఈ ఆరోపణలపై తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన స్పందిస్తూ, రాజకీయ ప్రేరేపిత ఆరోపణలను ఖండించారు. పొరుగు రాష్ట్రాలు హోసూరు ప్రాజెక్టును అడ్డుకుంటున్నాయనడానికి ఎటువంటి ఆధారాలు లేవని ఆమె స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న అసంబద్ధమైన వార్తలను నమ్మి అసెంబ్లీ వేదికపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని ఆమె ఎమ్మెల్యేకు హితవు పలికారు. పరిపాలనాపరమైన సమస్యలను రాజకీయ రంగు పులుమడం వల్ల అభివృద్ధి ప్రాజెక్టులకు నష్టం జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. హోసూరు విమానాశ్రయ ప్రాజెక్టుకు ఎదురవుతున్న సమస్యలను పరిశీలిస్తే, అందులో ప్రధానంగా సాంకేతికపరమైన అడ్డంకులు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. హోసూరు ప్రాంతం బెంగళూరుకు భౌగోళికంగా చాలా దగ్గరగా ఉండటం ఒక ప్రధాన సవాలు అంటున్నారు. ఇప్పటికే బెంగళూరులోని కెంపగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంతానికి సేవలందిస్తోందని, నిబంధనల ప్రకారం, ఒక ప్రధాన విమానాశ్రయం ఉన్న నిర్దిష్ట పరిధిలో మరొక విమానాశ్రయాన్ని నిర్మించాలంటే అనేక విమానయాన నియమాలను పాటించాల్సి ఉంటుందని చెబుతున్నారు. దీనితో పాటు, హోసూరులో ఉన్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ రక్షణ సౌకర్యాలు, అడ్డంకులు విమానాల రాకపోకలకు అనుమతులు లభించడంలో ప్రధాన ఆటంకాలుగా మారాయి ంటున్నారు. మరోవైపు, కుప్పం విమానాశ్రయం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవతో వేగంగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. భౌగోళికంగా కుప్పం కూడా బెంగళూరుకు దగ్గరగానే ఉన్నప్పటికీ, ఏపీ ప్రభుత్వం వ్యూహాత్మక ఒప్పందాలతో ముందడుగు వేసిందని అంటున్నారు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంతో సమన్వయం చేసుకుని, షరతులతో కూడిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందడంలో ప్రభుత్వం సఫలీకృతమైందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు కోసం 1,788 ఎకరాల భూమి అవసరమని గుర్తించగా, ఇప్పటికే దాదాపు 1,300 ఎకరాల భూసేకరణ పూర్తికావడం ప్రాజెక్టు పురోగతికి నిదర్శనంగా చెబుతున్నారు. కుప్పంను లాజిస్టిక్స్ హబ్‌గా మార్చడం ద్వారా చిత్తూరు జిల్లా పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం

విజయవాడ, ఆగస్టు 14 ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్ద కాలంగా లక్షలాది కుటుంబాలను కుంగదీస్తున్న అతిపెద్ద ఆర్థిక కుంభకోణం అగ్రిగోల్డ్ . తమ కష్టార్జితాన్ని దాచుకుని మునిగిపోయిన చిన్న తరహా డిపాజిటర్లకు రాబోయే ఆరు నెలల్లో డబ్బులు చెల్లించడమే లక్ష్యంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేసి, ప్రత్యేక కోర్టుల ద్వారా వేగవంతం చేయడంతో ఈ సుదీర్ఘ పోరాటానికి ఒక ముగింపు లభిస్తుందనే ఆశలు వ్యక్తమవుతున్నాయి. అగ్రిగోల్డ్ గ్రూప్ ఆఫ్ కంపెనీలు రియల్ ఎస్టేట్ ప్లాట్లు, అధిక వడ్డీల ఆశచూపి ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి సుమారు 32 లక్షల మంది డిపాజిటర్ల నుంచి దాదాపు 6,380 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించాయి. అందులో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే దాదాపు 19.5 లక్షల మంది బాధితులు ఉన్నారు. గత ప్రభుత్వాల హయాంలో రూ.10,000, రూ.20,000 లోపు ఉన్న చిన్న డిపాజిటర్లకు కొన్ని వందల కోట్లు చెల్లించినప్పటికీ, ఇంకా వేలాది మంది మిడియం, పెద్ద డిపాజిటర్లకు వేల కోట్ల రూపాయలు బకాయిపడి ఉన్నారు.అగ్రిగోల్డ్ గ్రూప్ కొనుగోలు చేసిన వేలాది ఎకరాల వ్యవసాయ భూములు, ప్లాట్లు, నివాస సముదాయాలు, గుంటూరు సమీపంలోని హాయ్‌లాండ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ వంటి ఆస్తులను సీఐడీ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేశాయి. ప్రెజెంట్ మార్కెట్ వాల్యూ ప్రకారం చూస్తే, ఈడీ, సీఐడీల వద్ద స్వాధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తుల విలువ 6,000 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఈ ఆస్తులను పారదర్శకంగా విక్రయిస్తే డిపాజిటర్ల బకాయిలు దాదాపుగా చెల్లించడానికి సరిపోతాయని అధికార యంత్రాంగం భావిస్తోంది.గతంలో 2014-19 టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనే అగ్రిగోల్డ్ ఆస్తులను ఈ-వేలం ద్వారా విక్రయించి డిపాజిటర్లకు సొమ్ము చెల్లించేందుకు హైకోర్టు పర్యవేక్షణలో ప్రయత్నాలు జరిగాయి. అయితే, ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నేతలు, వారికి అనుకూల వర్గాలు కోర్టుల్లో వివిధ రకాల పిటిషన్లు వేయడం, ఆస్తుల విలువను తక్కువ చేసి చూపుతున్నారంటూ వివాదాలు రేపడం వల్ల వేలం ప్రక్రియ వేగం పుంజుకోలేకపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా దఫాల వారీగా కొంతమందే చెల్లింపులు చేయగలిగింది తప్ప, అటాచ్ చేసిన ప్రధాన ఆస్తులన్నింటినీ వేలం వేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేకపోయింది.ఆస్తులను అమ్మి బాధితులకు డబ్బులు పంచడం చూడానికి సులువుగా కనిపించినా.. దీని వెనుక సంక్లిష్టమైన లీగల్ చిక్కులు ఉన్నాయి. పీఎంఎల్ఏ చట్టం కింద ఈడీకి ఉన్న హక్కులు, రాష్ట్ర సీఐడీ పరిధిలోని చట్టం కింద ఉన్న అటాచ్‌మెంట్ల మధ్య సమన్వయం సాధించి ఆస్తులను రిలీజ్ చేయించడం. అగ్రిగోల్డ్ యాజమాన్యం వివిధ బ్యాంకుల వద్ద ఆస్తులను కుదువబెట్టి రుణాలు తీసుకుంది. వాటి కోసం డెట్ రికవరీ ట్రిబ్యునల్ ద్వారా బ్యాంకులు తమకే మొదటి హక్కు ఉందంటూ హైకోర్టును ఆశ్రయించాయి. కంపెనీ ప్రమోటర్లు కుటుంబ సభ్యులు, బెనామీల పేర్లపై పెట్టిన ఆస్తులపై వచ్చిన లీగల్ ఛాలెంజెస్ ను కూడా అధిగమించాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక కోర్టుల ఏర్పాటును వేగవంతం చేసి, కేబినెట్ సబ్‌కమిటీ ద్వారా బాధితుల డేటాబేస్‌ను సరి చూస్తోంది. పెద్ద పెద్ద ల్యాండ్ పార్సెల్లను చిన్న ప్లాట్లుగా విభజించి వేలం వేయడం ద్వారా ఎక్కువ రాబడి రాబట్టవచ్చని ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రభుత్వం గనుక చట్టపరమైన అడ్డంకులను అధిగమించి, రాబోయే ఆరు నెలల గడువులోగా వేలం ప్రక్రియను పూర్తి చేసి డిపాజిటర్ల చేతికి డబ్బులు అందిస్తే.. అది ఒక చారిత్రాత్మక విజయంగా నిలుస్తుంది. దశాబ్ద కాలంగా నమ్మకం కోల్పోయిన లక్షలాది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది కొండంత అండగా మారడమే కాకుండా.. కూటమి ప్రభుత్వానికి రాజకీయంగా మైలేజ్ తెచ్చిపెడుతుంది.

విశాఖలో ఫుడ్ బ్యాంకులు

విశాఖపట్టణం, ఆగస్టు 14 : విశాఖపట్నంలో పోలీసులు కమ్యూనిటీ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో నగరంలో ఆగస్టు 15న ఈ ఫుడ్ బ్యాంకులు ప్రారంభిస్తున్నారు. విశాఖ నగర సీపీ శంఖబ్రతబాగ్చి ఆలోచనతో నగరంలోని ఐదుచోట్ల ఈ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. హోటల్స్, కేటరింగ్ నిర్వాహకుల సాయంతో వీటిని నిర్వహిస్తారు. అలాగే ఎవరైనా ఆహారం తీసుకొచ్చి ఫ్రిజ్‌లో పెట్టొచ్చు. ఈ ఫుడ్ ఫ్రీ.. ఎవరైనా తినొచ్చు. నగరంలో ఎవరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో కమ్యూనిటీ ఫ్రిజ్‌లకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ నెల 15న నగరంలో ఐదుచోట్ల ఫ్రిజ్‌లతో ఈ ఫుడ్ బ్యాంకుల్ని ప్రారంభించబోతున్నారు. నగరంలోని హోటల్స్, కేటరింగ్ నిర్వాహకులుతో పాటుగా ఎవరైనా ప్రత్యేక సందర్భాల్లో ఫుడ్ డొనేట్ చేసేందుకు ముందుకు వచ్చేవారి సహకారంతో వీటిని నిర్వహించనున్నారు. ప్రస్తుతానికి ఐదుచోట్లు ప్రారంభిస్తున్నా.. రాబోయే రోజుల్లో నగరంలో మరికొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.ఈ నెల 15న నగరంలోని రైల్వే స్టేషన్, జగదాంబ జంక్షన్, ద్వారకానగర్ బస్‌స్టేషన్, మద్దిలపాలెం, గాజువాక ప్రాంతాల్లో ప్రారంభిస్తున్నారు. ఈ ఐదుచోట్ల ప్రత్యేకంగా ఒక షెడ్ ఏర్పాటు చేసి.. అక్కడ ఓ రిఫ్రిజిరేటర్‌ను అందుబాటులో ఉంచుతారు. అక్కడ నాణ్యమైన, తాజా ఆహారాన్ని అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేశారు. ప్రతిరోజూ హోటల్స్, కేటరింగ్ నిర్వాహకుల సాయంతో మూడు పూటలా ఆహారాన్ని అక్కడ ఉంచుతారు. ఆయా ప్రాంతాల్లో ఇలా ఫుడ్ బ్యాంకులకు ఆహారం అందించేవారిని గుర్తించారు. ఒకవేళ ఎవరైనా బర్త్ డే, పెళ్లిరోజు, ఇతర ముఖ్యమైన సందర్భాల్లో ఫుడ్ పంపిణీ చేయాలనుకుంటే.. ఫుడ్‌బ్యాంక్ ద్వారా అవసరమైన వారికి అందజేస్తారు. మిగిలిపోయిన, పాడైపోయిన, సగం తినేసి వదిలేసిన ఆహారాన్ని తీసుకురావద్దని బోర్డులు ఏర్పాటు చేస్తారు.ఈ ఫుడ్‌బ్యాంకులకు సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతల్ని స్థానికంగా ఉండే కంట్రోల్ రూమ్ సీఐలకు సీపీ అప్పగించారు. ఒకవేళ ఎవరైనా ఫుడ్ బ్యాంకుకు ఆహారం అందజేయాలి అనుకుంటే స్థానికంగా ఉండే పోలీసుల్ని, ప్రత్యేకంగా ఒక మొబైల్ నంబర్ కేటాయించి ఫుడ్ బ్యాంకుల దగ్గర బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో ఆకలితో ఇబ్బందిపడేవారికి ఈ ఫుడ్ బ్యాంకులు ఎంతో ఉపయోగంగా ఉంటాయని భావిస్తున్నారు. అందుకే ఈ హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విశాఖపట్నం సీపీ శంఖబ్రతబాగ్చి ఆలోచనపై విశాఖవాసులు ప్రశంసలు కురిపిస్తు?న్నారు.

ఆర్ధరాత్రి టన్నెల్ లో మంత్రి నిమ్మల పరిశీలన

విజయవాడ :వెలుగొండ ప్రాజెక్టు టన్నెల్ -2 లో 12 వ కి . మీ దగ్గర చిక్కుకున్న టన్నెల్ బోరింగ్ మిషన్ వెలికితీత పనులను స్వయంగా పరిశీలించేందుకు మంత్రి నిమ్మల రామానాయుడు రాత్రి 11 గంటలకు టన్నెల్ లోకి వెళ్లారు. అయన వెంట ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి నిరీక్షణ బాబు మరియు ఇరిగేషన్ అధికారులు, మెగా ఇంజనీరింగ్ ప్రతినిధులు వున్నారు.అర్ధరాత్రి దాదాపు 4 గంటల పాటు టన్నెల్ లో టీబీఎం వెలికితీత పనులు, లైనింగ్ పనులను మంతరి స్వయం గా పరిశీలించారు.



తిరుపతి జిల్లా పుత్తూరులో విషాదం.. విద్యుదాఘాతంతో ఇద్దరు విద్యార్థుల మృతి..

పుత్తూరు: తిరుపతి జిల్లా పుత్తూరులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఇద్దరు విద్యార్థులు ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తూ మృతిచెందారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పుత్తూరులో ద్రౌపతమ్మ-ధర్మరాజుల ఉత్సవాల సందర్భంగా కె.ఎన్. రోడ్డులోని పూజా టెక్స్‌టైల్స్ వద్ద ఫ్లెక్సీ కట్టేందుకు కొంతమంది విద్యార్థులు గుమిగూడారు. ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తూ 11 కేవీ విద్యుత్ తీగలకు అది తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతులను విగ్నేష్ (19), గోకుల్ (18)గా గుర్తించారు. వారిద్దరూ స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు, బాధిత కుటుంబాలకు సమాచారం అందించారు. కుమారుల మృతిచెందడంతో బాధిత తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



స్పోర్ట్స్ స్కాన్

ఆసీస్ గడ్డపై చరిత్ర సృష్టించిన బంగ్లా ఓపెనర్.. 23 ఏళ్ల రికార్డ్ బద్దలు!

బంగ్లాదేశ్ ఓపెనర్ తంజీద్ హసన్ చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ బాదిన తొలి బంగ్లాదేశ్ ఆటగాడిగా రికార్డ్ సాధించాడు. తద్వారా 23 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా డార్విన్ వేదికగా జరగుతున్న తొలి టెస్ట్‌లో తంజీద్ హసన్(197 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 101) సెంచరీ సాధించడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు.ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్‌ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా హసన్ సర్కార్(76) పేరిట ఉన్న రికార్డ్‌ను తంజీద్ హసన్ అధిగమించాడు. 2003లో కెయిర్న్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో హసన్ సర్కార్ 76 పరుగులు చేశాడు. గత రెండ దశాబ్దాలుగా ఈ రికార్డ్ చెక్కుచెదరకుండా ఉంది.కెరీర్‌లో రెండో టెస్ట్ మాత్రమే ఆడుతున్న తంజీద్ హసన్.. తన తొలి టెస్ట్ శతకాన్ని ఆసీస్ గడ్డపై అందుకోవడం గమనార్హం. ఓవరాల్‌గా విదేశాల్లో సెంచరీ సాధించిన రెండో బంగ్లా బ్యాటర్‌గా కూడా తంజీద్ హసన్ నిలిచాడు. 2002లో మహ్మదుల్ హసన్ డర్బన్ వేదికగా సౌతాఫ్రికాపై 137 పరుగులు సాధించాడు.ఈ మ్యాచ్‌పై బంగ్లాదేశ్ పట్టు బిగించింది. తంజీద్ హసన్(197 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 101) సెంచరీతో చెలరేగడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 110 ఓవర్లలో 6 వికెట్లకు 351 పరుగులు చేసింది. నజ్ముల్ హోస్సేన్ షాంటో(126 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 84) తృటిలో శతకం చేజార్చుకోగా.. ముష్ఫికర్ రహీమ్(55 బంతుల్లో 5 ఫోర్లతో 36), మెహ్‌దీ హసన్ మిరాజ్(73 బంతుల్లో 3 ఫోర్లతో 32 బ్యాటింగ్) పర్వాలేదనిపించారు. హసన్ మహముద్(13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్(2/66), జోష్ హేజిల్ వుడ్(2/66) రెండేసి వికెట్లు తీయగా.. ప్యాట్ కమిన్స్, నాథన్ లయన్ చెరో వికెట్ పడగొట్టారు. ప్రస్తుతం బంగ్లాదేశ్ 153 పరుగుల ఆధిక్యంలో ఉంది. మూడో రోజు ఆటలో మరో 50 పరుగుల ఆధిక్యం సాధించి..రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్‌ను తర్వగా ఆలౌట్ చేస్తే చారిత్రాత్మక విజయం సొంతమవుతుంది.అంతకుముందు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకు ఆలౌటైంది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. టస్కిన్ అహ్మద్(2/55), ఎబాడన్ హోస్సేన్ (2/39) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్(109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు.



తొలి టెస్ట్‌కు ముగ్గురు స్పిన్నర్లతో టీమిండియా.. సర్ఫరాజ్‌కు చోటు!

రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో జరగనున్న తొలి టెస్ట్‌లో టీమిండియా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగనుంది. శనివారం గాలే వేదికగా ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. గాలే ఇంటర్నేషనల్ స్టేడియంలోని పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉండనుంది. తొలి రెండు రెండు రోజులు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, ఆ తర్వాత మూడు రోజులు స్పిన్నర్లకు సహకరిస్తుందని పిచ్ రిపోర్ట్ నివేదికలు వెల్లడిస్తున్నాయి.గురువారం పిచ్‌ను భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ పరీక్షించారు. భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉందని మోర్నీ మోర్కెల్ మీడియాకు వెల్లడించాడు. ముగ్గురు స్పిన్నర్లు అటాక్ చేస్తే.. ఇద్దరు పేసర్లు ఒత్తిడిని పెంచుతారని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతానికైతే తుది జట్టు ఇంకా ఖరారు చేయలేదని పేర్కొన్నాడు.కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా బరిలోకి దిగనుండగా.. మూడో స్పిన్నర్ కోసం మానవ్ సుతార్, సరాన్ష్ జైన్ మధ్య పోటీ నెలకొంది. ఆఫ్ స్పిన్‌కు ప్రాధాన్యత ఇస్తే సారాన్ష్ జైన్ బరిలోకి దిగుతాడు. పేసర్లుగా మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ బరిలోకి దిగనున్నారు. అయితే ప్రసిధ్ కృష్ణకు గుర్నూర్ బ్రార్‌తో పోటీ నెలకొంది. బ్యాటింగ్ విభాగంలో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. గాయంతో దూరమైన సాయి సుదర్శన్ స్థానంలో దేవదత్ పడిక్కల్ ఆడనుండగా.. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ బరిలోకి దిగనున్నారు.నాలుగు, ఐదు స్థానాల్లో శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ ఆడనున్నారు. అయితే ఆరో స్థానంలో ఎవర్ని ఆడిస్తారు? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఈ స్థానం కోసం సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. స్పిన్‌ను సమర్థవంతంగా ఆడే సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం ఇవ్వాలని మాజీ క్రికెటర్లు సూచిస్తున్నారు. సర్ఫరాజ్ ఖాన్‌వైపే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.శ్రీలంకతో తొలి టెస్ట్ భారత తుది జట్టు(అంచనా): కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రిషభ్ పంత్, సర్ఫరాజ్ ఖాన్/ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్/సారాన్ష్ జైన్, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ.



తొలి టెస్ట్‌కు ముగ్గురు స్పిన్నర్లతో టీమిండియా.. సర్ఫరాజ్‌కు చోటు!

రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో జరగనున్న తొలి టెస్ట్‌లో టీమిండియా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగనుంది. శనివారం గాలే వేదికగా ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. గాలే ఇంటర్నేషనల్ స్టేడియంలోని పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉండనుంది. తొలి రెండు రెండు రోజులు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, ఆ తర్వాత మూడు రోజులు స్పిన్నర్లకు సహకరిస్తుందని పిచ్ రిపోర్ట్ నివేదికలు వెల్లడిస్తున్నాయి.గురువారం పిచ్‌ను భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ పరీక్షించారు. భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉందని మోర్నీ మోర్కెల్ మీడియాకు వెల్లడించాడు. ముగ్గురు స్పిన్నర్లు అటాక్ చేస్తే.. ఇద్దరు పేసర్లు ఒత్తిడిని పెంచుతారని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతానికైతే తుది జట్టు ఇంకా ఖరారు చేయలేదని పేర్కొన్నాడు.కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా బరిలోకి దిగనుండగా.. మూడో స్పిన్నర్ కోసం మానవ్ సుతార్, సరాన్ష్ జైన్ మధ్య పోటీ నెలకొంది. ఆఫ్ స్పిన్‌కు ప్రాధాన్యత ఇస్తే సారాన్ష్ జైన్ బరిలోకి దిగుతాడు. పేసర్లుగా మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ బరిలోకి దిగనున్నారు. అయితే ప్రసిధ్ కృష్ణకు గుర్నూర్ బ్రార్‌తో పోటీ నెలకొంది. బ్యాటింగ్ విభాగంలో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. గాయంతో దూరమైన సాయి సుదర్శన్ స్థానంలో దేవదత్ పడిక్కల్ ఆడనుండగా.. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ బరిలోకి దిగనున్నారు.నాలుగు, ఐదు స్థానాల్లో శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ ఆడనున్నారు. అయితే ఆరో స్థానంలో ఎవర్ని ఆడిస్తారు? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఈ స్థానం కోసం సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. స్పిన్‌ను సమర్థవంతంగా ఆడే సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం ఇవ్వాలని మాజీ క్రికెటర్లు సూచిస్తున్నారు. సర్ఫరాజ్ ఖాన్‌వైపే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.శ్రీలంకతో తొలి టెస్ట్ భారత తుది జట్టు(అంచనా): కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రిషభ్ పంత్, సర్ఫరాజ్ ఖాన్/ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్/సారాన్ష్ జైన్, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ.



ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ మిచెల్ స్టార్క్ అరుదైన ఘనత



డార్విన్ వేదికగా ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ మధ్య తొలి టెస్టు జరుగుతోంది. ఈ క్రమంలోనే ఆసీస్ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ ఓ అరుదైన మైలు రాయిని అందుకున్నాడు. టెస్టు క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన జాబితాలో స్టార్క్ ఆరో స్థానానికి ఎగబాకాడు. బంగ్లా ప్లేయర్ లిట్టన్ దాస్ వికెట్‌తో స్టార్క్ ఈ ఫీట్ సాధించాడుస్టార్క్ ఇప్పటి వరకు తన టెస్ట్ కెరీర్‌లో 106 మ్యాచ్‌లు ఆడి 435 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలోనే భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్(434)ను మిచెల్ అధిగమించాడు. మరో నాలుగు వికెట్లు పడగొడితే డేల్ స్టెయిన్(439) రికార్డును కూడా దాటేసి టాప్-5లోకి అతడు అడుగుపెడతాడు. టెస్టుల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన ఎడమ చేతి వాటం బౌలర్‌గా స్టార్క్ నే కొనసాగుతున్నాడు. ఇకఓవరాల్‌గా టెస్టు ఫార్మట్‌లో ఎక్కువ వకెట్లు తీసిన పేసర్ల జాబితాలో జేమ్స్ అండర్సన్(704) నెంబర్ వన్ స్థానంలో ఉన్నాడు.ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. ఆతిథ్య ఆస్ట్రేలియాపై బంగ్లాదేశ్ పూర్తి ఆధిపత్యం చెలాయిస్తోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 110 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 351 పరుగులు చేసింది. బంగ్లా జట్టు ప్రస్తుతం 153 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ లో 198 పరుగుల స్వల్ప స్కోర్కే ఆలౌటైన సంగతి తెలిసిందే.

టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన పేసర్లు:జేమ్స్ అండర్సన్ (ఇంగ్లండ్) ? 704స్టువర్ట్ బ్రాడ్ (ఇంగ్లండ్) ? 604
గ్లెన్ మెక్‌గ్రాత్ (ఆస్ట్రేలియా) ? 563కోర్ట్నీ వాల్ష్ (వెస్టిండీస్) ? 519డేల్ స్టెయిన్ (సౌతాఫ్రికా) ? 439
మిచెల్ స్టార్క్ (ఆస్ట్రేలియా) ? 435×కపిల్ దేవ్ (భారత్) ? 434

ప్రత్యేకమైన టెస్ట్‌కి కెప్టెన్‌గా ఉండటం గర్వంగా ఉందిः గిల్



శనివారం (ఆగస్టు 15) నుంచి భారత్-శ్రీలంక మధ్య టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. గాలె వేదికగా తొలి టెస్ట్ మ్యాచ్ జరగనుంది. మరోవైపు టీం ఇండియా టెస్ట్ జట్టుకు కెప్టెన్‌గా శుభ్‌మాన్ గిల్ సంవత్సరకాలం పూర్తి చేసుకున్నాడు. అయితే రేపటి టెస్ట్ మ్యాచ్‌కి ఓ ప్రత్యేకత ఉంది. భారత్‌కి ఇది 600వ టెస్ట్ మ్యాచ్. దీంతో ఈ ప్రత్యేకమైన టెస్ట్‌కి కెప్టెన్‌గా వ్యవహరించడం గర్వంగా ఉందని గిల్ అన్నాడు. భారత స్వాతంత్ర్య దినోత్సవం రోజున మ్యాచ్ ప్రారంభం కావడం మరింత ప్రత్యేకతను సంతరించుకుంటుందని తెలిపాడు."కెప్టెన్ పాత్రలో నేను చాలా సౌకర్యంగా ఉన్నా. ఇప్పుడు శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌లోనూ విజయం సాధించి వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉంచుకోవడమే మా లక్ష్యం. కనీసం మేం ఏడు టెస్టుల్లో గెలవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి నుంచి మొదలుపెడతాం. అంతేకాకుండా స్వాతంత్ర్య దినోత్సవం రోజునే భారత్ 600వ టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఇలాంటి పోరుకు నాయకత్వం వహించడం గొప్ప గౌరవం" అని గిల్ తెలిపాడు.

నా దారికే అడ్డొస్తావా మిచెల్ స్టార్క్ వీ మెహ్‌దీ హసన్ డిష్యూం డిష్యూం

ఆస్ట్రేలియా వర్సెస్ బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్, మెహ్‌దీ హసన్ మధ్య వాగ్వాదం జరిగింది. 'నా దారికే అడ్డొస్తావా?'అని వేలు చూపిస్తూ మిచెల్ స్టార్క్.. మెహ్‌దీ హసన్‌కు వార్నింగ్ ఇచ్చాడు. అతను కూడా ధీటుగా బదులివ్వడంతో చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుంది. అంపైర్ జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.రెండో రోజు ఆటలో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో ఆఫ్ సైడ్ ఆడిన మిరాజ్.. క్విక్ సింగిల్‌కు ప్రయత్నించాడు. అయితే అతను మిచెల్ స్టార్క్‌కు ఎదురుగా పరుగెత్తాడు. అతను అడ్డుగా ఉన్నాడని పక్కకు జరిగి పిచ్ మధ్యలో నుంచి పరుగు పూర్తి చేశాడు. ఇది గమనించిన అంపైర్ మెహ్‌దీ హసన్‌కు వార్నింగ్ ఇచ్చాడు. మిచెల్ స్టార్క్ అడ్డు రావడంతోనే పిచ్ మధ్యలో పరుగెత్తాల్సి వచ్చిందని మెహ్‌దీ హసన్ అంపైర్‌తో అన్నాడు.దాంతో తీవ్ర అసహనానికి గురైన మిచెల్ స్టార్క్..'ఇది నా ఫాలో త్రూ.. నీ దారి కాదు. పిచ్‌పై నుంచి తప్పుకో'అని ఘాటుగా బదులిచ్చాడు. ఈ మాటలు స్టంప్ మైక్‌లో రికార్డ్ అవ్వగా.. ఈ వీడియోను క్రికెట్ ఆస్ట్రేలియా సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. దాంతో వైరల్‌గా మారింది. బంగ్లాదేశ్ బ్యాట్లర్ల అద్భుత బ్యాటింగ్‌తో మిచెల్ స్టార్క్ పలుమార్లు సహనం కోల్పోయాడు.ఈ మ్యాచ్‌పై బంగ్లాదేశ్ పట్టు బిగించింది. తంజీద్ హసన్(197 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 101) సెంచరీతో చెలరేగడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 110 ఓవర్లలో 6 వికెట్లకు 351 పరుగులు చేసింది. నజ్ముల్ హోస్సేన్ షాంటో(126 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 84) తృటిలో శతకం చేజార్చుకోగా.. ముష్ఫికర్ రహీమ్(55 బంతుల్లో 5 ఫోర్లతో 36), మెహ్‌దీ హసన్ మిరాజ్(73 బంతుల్లో 3 ఫోర్లతో 32 బ్యాటింగ్) పర్వాలేదనిపించారు. హసన్ మహముద్(13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.స్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్(2/66), జోష్ హేజిల్ వుడ్(2/66) రెండేసి వికెట్లు తీయగా.. ప్యాట్ కమిన్స్, నాథన్ లయన్ చెరో వికెట్ పడగొట్టారు. ప్రస్తుతం బంగ్లాదేశ్ 153 పరుగుల ఆధిక్యంలో ఉంది. మూడో రోజు ఆటలో మరో 50 పరుగుల ఆధిక్యం సాధించి..రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్‌ను తర్వగా ఆలౌట్ చేస్తే చారిత్రాత్మక విజయం సొంతమవుతుంది.అంతకుముందు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకు ఆలౌటైంది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. టస్కిన్ అహ్మద్(2/55), ఎబాడన్ హోస్సేన్ (2/39) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్(109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు.



ఖర్గే సభా స్థలి శుద్ధీకరణను ఖండించిన కాంగ్రెస్ బీజేపీ తక్షణమే క్షమాపణ చెప్పాలి - ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి




నాగర్ కర్నూల్ (తెలంగాణ పవర్) ఆగస్టు : 14 : ఉత్తరాఖండ్ రాష్ట్రం హల్ద్వానీలోని రామ్ లీలా మైదానంలో జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్వహించిన సభా స్థలాన్ని శుద్ధీకరణ పేరుతో అవమానపరిచిన బీజేపీ పార్టీ తక్షణమే క్షమాపణ చెప్పాలని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి డిమాండ్ చేశారు.

శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులతో నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులకు సభలు నిర్వహించే హక్కు ఉందని, కానీ బీజేపీ నేతలు కుట్రపూరితంగా ఖర్గే సభ జరిగిన ప్రాంతాన్ని కడిగి అవమానించారని ఆరోపించారు.

కాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేస్తామని భీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్ ,ఎస్సి సెల్ అధ్యక్షులు వంకేశ్వర్ నిరంజన్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఆధార్ పార్టీ నాగర్ కర్నూల్ అసెంబ్లీ ఇన్చార్జిగా గోవిందు సాయిబాబు నియామకం



నాగర్ కర్నూల్ :- ఆధార్ పార్టీ నాగర్ కర్నూల్ అసెంబ్లీ ఇన్చార్జిగా తెల్కపల్లి మండలం గౌరారం గ్రామానికి చెందిన గోవిందు సాయిబాబాను ఆధార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఈఎస్ఆర్ నియమించారు. శుక్రవారం హిమాయత్ నగర్ కార్యాలయంలో అధికారికంగా ప్రకటించారు. గోవింద్ మాట్లాడుతూ.... పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీ నియమ నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంటు ఇంచార్జ్ జెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన 200 మీటర్ల మువ్వన్నెల పతాకం.

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 14 తెలంగాణ పవర్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో భారత స్వాతంత్ర 80వ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మణుగూరు అశోక్ నగర్ నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా సురక్ష బస్టాండ్ వరకు 200 మీటర్ల జాతీయ పతాక ప్రదర్శన ర్యాలీని ఘనంగా నిర్వహించారు.

భారతీయ సేవా సమితి సభ్యులు దుగ్గి బ్రహ్మతేజ ఆధ్వర్యంలో ఘనంగా 200 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శనలు చురుకుగా విద్యార్థులు ఉపాధ్యాయులు పుర ప్రముఖులు దేశభక్తులు , పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు..

భారతీయ సేవా సమితి సభ్యుడు దుగ్గి బ్రహ్మ తేజ మాట్లాడుతూ..

మణుగూరు పట్టణంలో ఈ రెండు వందల మీటర్ల జాతీయ జెండా ప్రదర్శనలో యువత దేశం పై భక్తిని యువతలో పెంపొందించడమే లక్ష్యంగా యువతను పెడదోవ పోకుండా చెడు అలవాట్లకు బానిసలు కాకుండా దేశం పై ప్రేమను కుటుంబం పై అభిమానాన్ని పెంపొందించుతూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా ఈ మువ్వన్నెల



జెండా ప్రదర్శన ఎంతో దోహదపడుతుందని యువతలో చైతన్యవంతులై దేశ రక్షణలో దేశభక్తిలో ముందుండి బంగారు భవిష్యత్తుని నిర్మించుకుంటారని ఉద్దేశంతోనే ఎంతో గొప్పగా ఈ రెండు వందల మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన నిర్వహించామని సహకరించిన విద్యార్థులు పుర ప్రముఖులను దేశభక్తులను పలు సంఘాల నాయకులుకూడా ఈ ర్యాలీలో పాల్గొనడం హర్ష నియమన్నారు.

వెల్లుల్ల జెడ్పీహెచ్ఎస్‌లో ఋతుక్రమ శుభ్రత నిర్వహణ కార్నర్ ప్రారంభం..

మెట్‌పల్లి, ఆగస్టు 14 (తెలంగాణ పవర్): మండలంలోని వెల్లుల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల కోసం ఏర్పాటు చేసిన మెన్స్ట్రువల్ హైజిన్ మేనేజ్మెంట్ కార్నర్ తో పాటు శానిటరీ ప్యాడ్స్ ఇన్సినరేటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. మండల విద్యాధికారి కొండ కనకతార, గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి, వైద్యాధికారి అజిత్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ పోచంపల్లి లక్ష్మి కార్యక్రమంలో పాల్గొని వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి కొండ కనకతార మాట్లాడుతూ.. నెలసరి సమయంలో బాలికలు పాఠశాలకు గైర్హాజరు కాకుండా ఉండేందుకు పాఠశాలలోనే శానిటరీ న్యాప్‌కిన్స్ అందించడంతో పాటు గర్ల్ ఫ్రెండ్లీ టీచర్ ఆధ్వర్యంలో మెన్స్ట్రువల్ హైజిన్ మేనేజ్మెంట్ కార్నర్ ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరమన్నారు. బాలికల్లో ఋతుక్రమ పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. వైద్యాధికారి అజిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యాసంస్థలో ఇలాంటి వీఎవీ కార్నర్లు అవసరమని అన్నారు. బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతకు సంబంధించి ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి మాట్లాడుతూ 50 మందికి పైగా బాలికలు చదువుతున్న ప్రతి హైస్కూల్‌కు వాడిన శానిటరీ ప్యాడ్స్‌ను సురక్షితంగా నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ఇన్సినరేటర్‌ను అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో గ్రామ పాలనాధికారులు నాగరాణి,



రాజేశం, ఏఎన్ఎం సువర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారు



తెలంగాణ పవర్ న్యూస్ హయత్ నగర్ డివిజన్ ఎల్బీనగర్ ఆగస్టు హయత్‌నగర్ పరిధిలో మండల ఆఫీసు ఆవరణలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలోని అమ్మవారిని హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారు దర్శించుకుని వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు కృపను పొంది తీర్థప్రసాదాలను స్వీకరించారు

ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు, కృపతో హయత్‌నగర్ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అలాగే ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వారన్నారు ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు మహేష్ ముదిరాజ్ కమిటీ సభ్యులు నాయకులు అర్చకులు భక్తులు యువత మహిళలు తదితరులు పాల్గొన్నారు

మత్తు పదార్థాలపై అశ్వాపురం పోలీసుల ఉక్కుపాదం.



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 14 తెలంగాణ పవర్ : మాదక ద్రవ్యాలకు బానిసైన ఇద్దరు వ్యక్తులను అశ్వాపురం పోలీసులు అదుపులోకి తీసుకుని పరీక్షలు నిర్వహించగా, వారికి మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించిన పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో వారిని చికిత్స, పునరావాసం నిమిత్తం భద్రాచలంలోని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించారు.

ఈ సందర్భంగా అశ్వాపురం ఇన్‌స్పెక్టర్ చిలువేరు ఎల్లయ్య మండల ప్రజలకు కీలక సూచనలు చేశారు. మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని, ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకుండా ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకుని తమ భవిష్యత్తును బంగారు బాటలో నడిపించుకోవాలని కోరారు. “మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు కన్నవారికి, ఉన్న ఊరికి మంచి పేరు తీసుకురావాలి” అని యువతకు సూచించారు.

మాదక ద్రవ్యాలను తీసుకోవడం, విక్రయించడం, కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు. మత్తు పదార్థాల సరఫరా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అశ్వాపురం పోలీసులు స్పష్టం చేశారు.

కరాటే శిక్షకుడు వసంత్‌కుమార్‌కు సీపీ సత్కారం



కరీంనగర్, ఆగస్ట్ 14: మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘దీరా’ కార్యక్రమాన్ని గురువారం తొర్రూర్ డివిజన్ మునగనూరులోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రాంగణంలో మల్కాజిగిరి కమీషనరేట్ పోలీస్ కమిషనర్ బి సుమతి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికలకు ఆత్మరక్షణ, క్రమశిక్షణ, మానసిక ధైర్యం, మార్షల్ ఆర్ట్స్ ద్వారా వ్యక్తిగత భద్రత వంటి అంశాలపై శిక్షణను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ అందిస్తున్న కరాటే శిక్షకుడు కె వసంత్‌కుమార్‌ను పోలీస్ కమిషనర్ సుమతి సన్మానించారు. బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ఆపద సమయంలో తమను తాము రక్షించుకునే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీబీ అనురాధ, మహిళా భద్రతా విభాగం ఉషారాణి, పలువురు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. కరాటే ఇన్‌స్ట్రక్టర్లు మొయిజ్, రాజశేఖర్, అనిల్, వీణ తదితరులు పాల్గొన్నట్లు కరాటే శిక్షకుడు కె వసంత్‌కుమార్ తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసుల్లో 8 మంది నిందితుల అరెస్టు. 26 లక్షల విలువైన సొత్తు స్వాధీనం..



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 14 తెలంగాణ పవర్ : భద్రాది జిల్లాలో వరుస చైన్ స్నాచింగ్ కేసుల్లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, డీఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో 8 మంది నిందితులను అరెస్టు చేయగా, సుమారు 150 గ్రాములు ఆరు బంగారు గొలుసులు, మూడు ద్విచక్ర వాహనాలు, స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు 20 లక్షలు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసును చేదించిన వారిలో పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్, అశ్వారావుపేట సిఐ నాగరాజు, ఎస్సైలు రాజేష్ కుమార్, రాజు, బాలస్వామి నాదం, దేవ సింగ్, ప్రసాద్, కానిస్టేబుల్ వెంకట్ ధర్మారావు లక్ష్మయ్య రామకృష్ణారెడ్డి బాలకృష్ణ నరసింహారావు, మౌనిక తదితరులు ఉన్నారు.

సినిమా

12న ఇరుముడి ట్రైలర్ విడుదలకు సన్నాహాలు


మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా



అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.


ఇంద్రపుత్రగా కిరణ్ అబ్బవరం

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ఇటీవల ఆయన నటించిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి రెస్పాన్స్ అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా సత్తా చాటుతోంది. ఈ నక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న కిరణ్.. మరోవైపు భారీ స్థాయిలో తెరకెక్కనున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కిరణ్ అబ్బవరం ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ భాగస్వామ్యంతో ఓ భారీ బడ్జెట్ మైథలాజికల్ సినిమాలో నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కీలక వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి 'ఇంద్రపుత్ర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర బృందం ఆసక్తిని పెంచింది. పేరు చూస్తేనే ఇది పురాణ, ఇతిహాస నేపథ్యంతో రూపొందనున్న భారీ చిత్రమనే విషయం స్పష్టమవుతోంది. ఈ సినిమాతో



శ్రీకాంత్ పుప్పాల దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఆయన గతంలో 'కాంతార చాప్టర్ 1' చిత్రానికి ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ అనుభవాన్ని ఇప్పుడు తన తొలి దర్శకత్వ చిత్రానికి ఉపయోగించుకోనున్నారు. భారీ విజువల్స్, పురాణ నేపథ్యం, విభిన్నమైన కథాంశంతో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రూపొందించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. 'ఇంద్రపుత్ర' రెగ్యులర్ షూటింగ్‌ను అక్టోబర్‌లో ప్రారంభించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.


సందీప్ కిషన్ సరికొత్త చిత్రం కరికాల



యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. తాజాగా 'కరికాల' అనే భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో పీరియాడిక్ కథలు, రాజుల చరిత్ర, యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు సందీప్ కిషన్ కూడా ఓ భారీ పీరియాడిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'శంబాల' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై యుద్ధానికి దూసుకెళ్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో ఆయన పక్కనే ఓ సింహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యుద్ధభూమి వాతావరణం, భారీ విజువల్స్, పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. పోస్టర్‌ను బట్టి చూస్తే, ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా చారిత్రక నేపథ్యంతో కూడిన ఎమోషనల్ సాగా కూడా కావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా తెరకెక్కించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విడుదల తేదీలను కూడా అధికారికంగా వెల్లడించారు. 'కరికాల చాప్టర్ 1' : 2027 జూలై 2, 'కరికాల చాప్టర్ 2' : 2027 అక్టోబర్ 28 అంటే కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రెండు భాగాలను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేయడం విశేషం. ఇప్పటివరకు సందీప్ కిషన్ ఎక్కువగా యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాల్లో కనిపించారు. అయితే 'కరికాల' తో తొలిసారి భారీ పీరియాడిక్ యాక్షన్ కథలో నటిస్తున్నారు. అయితే సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతం 'సిగ్మా' విడుదల కోసం సందీప్ కిషన్ ఎదురు చూస్తున్నారు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. జులై 31న 'సిగ్మా' విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల ఇది వాయిదా పడింది.

1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో చేరిన ది ఒడిస్సీ

హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన తాజా విజువల్ వండర్ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల్లోనే ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో (దాదాపు రూ.9,500 కోట్లకు పైగా) అడుగుపెట్టింది క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో 1 బిలియన్ మార్కును అందుకున్న మూడో చిత్రంగా 'ది ఒడిస్సీ' నిలిచింది. అంతకుముందు ఆయన దర్శకత్వం వహించిన 'ది డార్క్ నైట్' (1.008 బిలియన్), 'ది డార్క్ నైట్ రైజెస్' (1.08 బిలియన్) ఈ ఘనత సాధించాయి. గతేడాది వచ్చిన 'ఓపెన్‌హైమర్' ఈ మార్కుకు కాస్త దూరంలో ఆగిపోయింది. కాగా, ఈ వీకెండ్ ముగిసేసరికి 'ది ఒడిస్సీ' నోలన్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక్క ఐమాక్స్ స్క్రీన్ల నుంచే ఏకంగా 257 మిలియన్ డాలర్ల వసూళ్లు (దాదాపు రూ.2,445 కోట్లు) రావడం విశేషం. త్వరలోనే ఐమాక్స్ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగానూ ఇది నిలవనుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అయిన చైనాలో ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది.



చైనా వ్యాప్తంగా దాదాపు 800 ఐమాక్స్ స్క్రీన్లతో పాటు వేలాది సాధారణ స్క్రీన్లలో అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయడానికి మేకర్స్ లాన్ చేస్తున్నారు దీంతో ఈ సినిమా మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది.

రామాయణ తాలుత విదేశాల్లో విడుదల



రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్‌లో ముందుగా.. ఆ తర్వాత భారత్‌లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి నవంబర్ 8 రోజే విడుదల చేస్తాం అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బడ్జెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.



మిస్సింగ్ మేఘన ..ఫస్ట్ లుక్ విడుదల

రామ్ కార్తీక్ హీరోగా, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపీ మూవీస్ మరియు కేడి అండ్ కో బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం టాలీవుడ్ ప్రముఖ టెక్నీషియన్లు, సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ఈ చిత్ర పోస్టర్‌ను తన చేతుల మీదుగా విడుదల చేసి సినిమా యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బెక్కం వేణుగోపాల్‌తో పాటు చిత్ర బృందమంతా ఉత్సాహంగా పాల్గొంది. ఈ సందర్భంగా వి.వి. వినాయక్ మాట్లాడుతూ, బెక్కం వేణుగోపాల్, శ్రీనివాస్ ల సహకారంతో దర్శకుడు వాచస్పతి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారని తెలిపారు. ఈ సినిమాతో హీరో రామ్ కార్తీక్, దర్శకుడు వాచస్పతిలకు మంచి పేరు రావాలని, అలాగే సంగీతంతో పాటు పాటలు కూడా అందించే ఆల్ రౌండర్ ధ్రువన్‌కు ఈ చిత్రం ద్వారా మంచి గుర్తింపు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ చిత్ర యూనిట్ మొత్తానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, వి.వి. వినాయక్ గారిది గో÷-డలెన్ హ్యాండ్ అని, ఆయన చేతుల మీదుగా తమ సినిమా పోస్టర్ లాంచ్ కావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మీడియా సహకారంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రం ఒక చక్కటి సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఉంటుందని, ప్రేక్షకులను అలరించే అన్ని కమర్షియల్ హంగులు ఇందులో ఉన్నాయని తెలిపారు. అతి త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. హీరో రామ్ కార్తీక్ మాట్లాడుతూ, తమకు ఈ చిత్రంలో అవకాశం కల్పించిన దర్శకుడు వాచస్పతికి, నిర్మాత నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులందరినీ అలరిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్ మాట్లాడుతూ, లెజెండ్రీ డైరెక్టర్ వి.వి. వినాయక్ చేతుల మీదుగా పోస్టర్ విడుదల కావడం తన కెరీర్‌లో మరువలేని క్షణమని, ఒక మంచి మ్యూజిషియన్‌కు కావాల్సిన అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయని వెల్లడించారు. ఈ చిత్రానికి శామ్ కె. నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా, వనరాజ్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు.



Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844